PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 21.12.2012, శుక్రవారం
సంపుటి : 32 సంచిక : 29
పేజీలు : 12, వెల : ₹ 4

24గం॥ చిన్నపిల్లల స్పెషలిస్టులచే వైద్యం చేయు ఏకైక చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్
నెలలు తక్కువ బిడ్డా ? సంరక్షణ కొరకు...
పుట్టిన పిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (NICU)

Dr. T. Ravikumar's
రిచ్ హాస్పిటల్
రవి చిన్నపిల్లల హాస్పిటల్

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## నిర్లక్ష్యానికి కేరాఫ్

# బేగంపేట 'ఫైర్‌పోర్టు'

నిర్లక్ష్యం... నిర్లిప్తత... ప్రభుత్వ వ్యవస్థలో అడుగడుగునా ఆవహించింది. ఈ నిర్లక్ష్యం విలువ... మహానాయకుల ప్రాణాలు... కోట్ల రూపాయల ఆస్తులు బుగ్గిపాలు.

బెల్



మహానేత వై.యస్. మృతికి కారణమయ్యింది

బేగంపేట... అంతు తెలియని ప్రమాదాలకు ఇది పెట్టని కోట. మొన్నటి దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి మిస్టరీ మరణాన్ని మొదలుకొని నిన్నటి అగ్నిప్రమాదం వరకు బేగంపేట ఎయిర్ పోర్టు ఎన్నో సందేహాలకు వేదికగా నిలుస్తుంది. సోమవారం అర్ధరాత్రి ఈ ఎయిర్‌పోర్టులో (మిగతా 5వ పేజీలో)

అగస్టా



అధికారుల అలసత్వానికి కాలిబూడిదయ్యింది



## సింహపురి స్టార్‌కు మెగాస్టార్ పరామర్శ

వివరాలు 12వ పేజీలో...

### టి.ఆర్.యస్ Vs వై.యస్.ఆర్.సి.

## రగడ రగులుకుంది

తెలంగాణలో కొత్త రగడ రాజుకుంది. ఇది తెలంగాణ కోసం రగిలిన గొడవకాదు. ఆధిపత్యపోరులో ఎవరికంటే ఎవరు గొప్పన్న వివాదంతో మొదలై పెరిగి పెరిగి కర్రలుకత్తులూ దూసుకుని, రాళ్లు రప్పలూ విసురుకుని కార్యాలయాలు, కార్ల అద్దాలు పగలకొట్టుకునే స్థాయికి పెరిగింది. తెలంగాణలో 'జగన్' పార్టీకి లభిస్తున్న ఆదరణ, పెరుగుతున్న అభిమానుల సంఖ్యను చూసిన "దొర" కొత్త పన్నాగంతో జగన్‌పార్టీని ఎదుర్కొనే ప్రయత్నం ప్రారంభించాడు. అయితే అది తన ఉనికికే ప్రమాదమనే సంగతి ఈ "దొర" గుర్తించలేక పోవడం సహజంగానే తెలంగాణ మేధావుల మేధస్సును తెలియజేస్తుంది.

గతంలో వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఓదార్పుయాత్ర ప్రారంభించారు. ఆనాడు తెలంగాణలోని మానుకోటలో తెలంగాణవాదులు యాత్రను అడ్డుకున్నారు అంతే ఘర్షణల వరకూ వెళ్లలేదు. పరకాలను ప్రతిష్ఠాత్మకంగా (మిగతా 5వ పేజీలో)



# మోడీకే... గుండెల్లో "గుడి"

### హిమాచల్ గెలుపుతో పరువు నిలుపుకున్న కాంగ్రెస్

అంచనాలు మారాయిగాని.. ఫలితం మారలేదు. అద్భుతాలు జరగలేదు గాని అనుకున్నది మాత్రం జరిగింది. గుజరాతీయుల గుండెల్లో 'మోడీ' ముద్ర స్పష్టంగా కనిపించింది. గుజరాత్ శాసనసభ ఎన్నికలలో బీజేపీ వరుసగా అయిదోసారి విజయకేతనం ఎగురవేసి పశ్చిమబెంగాల్‌లో కమ్యూనిస్టుల పేరిటవున్న రికార్డును బద్దలు చేయగా, తన నాయకత్వంలో వరుసగా మూడోసారి పార్టీని అధికారంలోకి తెచ్చి నరేంద్ర మోడీ సరికొత్త రికార్డు సృష్టించారు. అయితే 'మోడీ' అభివృద్ధి ప్రభంజనంలో అడ్రస్ లేకుండా పోతుందనుకున్న ప్రతిపక్ష కాంగ్రెస్‌పార్టీ అనూహ్యంగా పుంజుకుని గతంకన్నా మెరుగ్గా ఒక్క సీటును సాధించడం విశేషం.

మొత్తం 182 స్థానాలకుగాను బీజేపీ 116స్థానాలలో విజయం సాధించి వరుసగా ఐదోసారి అధికారాన్ని నిలబెట్టుకుంది. కాంగ్రెస్ మాత్రం 60 సీట్లు సాధించి గతంకంటే ఒక సీటు పెంచుకుంది. బీజేపీ నుండి బయటకొచ్చి గుజరాత్ పరివర్తన్‌పార్టీని స్థాపించిన మాజీముఖ్యమంత్రి కేశూభాయ్‌పటేల్ పలు (మిగతా 5వ పేజీలో)



PDF Compressor Free Version



## ప్రపంచ తెలుగు మహాసభలలో..
# కవులకు కరువు

ఇది వినడానికే సిగ్గుచేటైన విషయం. మరో వారం రోజుల్లో తిరుపతిలో ప్రారంభంకానున్న ప్రపంచ తెలుగు మహాసభలకి కవులు, రచయితలు కరువయ్యారని సమాచారం. 1975లో జరిగిన తొలి ప్రపంచ తెలుగు మహాసభలలో 300మందికి పైగా కవులు రచయితలు నాటి సభలలో పాల్గొంటే ఈసారి ఇప్పటి వరకూ కేవలం 100మందినే ఎంపికచేశారని తెలిసింది. ఎందరో మహాకవులకు మేధావులకు, రచయితలకు కొలువైన మన రాష్ట్రంలో తెలుగు మహాసభలకోసం కవులకు రచయితలకు కరువు రావడం బాధాకరమైన విషయం. గురజాడ అప్పారావు, శంకరంబాడి సుందరాచారి, కవికోకిల దువ్వూరు రామిరెడ్డి, విశ్వనాథ సత్యనారాయణ, రాయప్రోలు సుబ్బారావు, గుర్రం జాషువా, శ్రీశ్రీ, వేములపల్లి శ్రీకృష్ణ దాశరథి, ఆత్రేయ, త్రిపురనేని మహారథి, వేటూరి, గుంటూరు శేషేంద్రశర్మ, యం.యస్.రెడ్డి, ఆరుద్ర, పరాభి... ఇలా చెప్పుకుంటూపోతే వేళ్లమీద కాకుండా వేలల్లో కవితలు, కథలు, వ్యాసాలరూపంలో తెలుగుజాతికి అందించిన ఘనాపాటీలు ఎందరికో నెలవైన గడ్డ తెలుగుగడ్డ.

నేటి ఆధునిక సమాజంలో పాతతరం పోకడతో అచ్చమైన తెలుగు పదజాలాన్ని ప్రయోగించి రచనలు చేసేవారు బహుఅరుదుగా కనిపిస్తున్నారు. అందరికీ అర్థమయ్యేలా వ్యవహారిక భాషకు ప్రాధాన్యతనిస్తూ అసలైన తెలుగుకు మంగళం పాడేశారు. ముఖ్యంగా టీ.వి.ఛానళ్లు, ఇంటర్‌నెట్ బ్లాగుల్లో వస్తున్న భాష అత్యంత ప్రభావితం చేస్తున్న నేటి కాలంలో పాతకాలపు తెలుగు పరిమళాలు ఎక్కడా గుబాళించే పరిస్థితేలేదు.

దాదాపు 37సంవత్సరాలక్రితం జరిగిన తెలుగు మహాసభలకి రేపు జరగబోయే తెలుగు మహాసభలని పోలిస్తే ఆనాడు మెరిసిన నక్షత్రాలతో సరితూగగలిగే విజ్ఞానవంతులు పాల్గొనే శాతం ఏమాత్రం వుంటుందో ప్రశ్నార్థకమే. ఇప్పటికైనా మన ప్రభుత్వాలు మేల్కొని తెలుగుకున్న తియ్యదనాన్ని తెలుగు పదాలకున్న కమ్మదనాన్ని రేపటి తరం వారికి తెలియజేయకపోతే ఇప్పటికే ఆచరణలో వున్న మమ్మీ, డాడీ కల్చర్ కూడా మాయమై, మామ్, డాడ్ అనే స్థాయికి మన వారసులు దిగజారే ప్రమాదముంది. తస్మాత్ జాగ్రత్త...!

## తెలుగుతల్లికి..
# కళాకృతి అర్చన..!



తిరుపతిలో జరుగనున్న ప్రపంచ తెలుగుమహాసభలను పురస్కరించుకుని నెల్లూరుకు చెందిన ఓ సూక్ష్మకళాకారుడు తెలుగుతల్లికి అరుదైన, అద్భుతమైన కళాకృతితో అర్చన చేసాడు. నెల్లూరు, మూలాపేటలో నివాసముంటున్న గంధవళ్ల ఉమాశంకర్ ముత్తుకూరు మండలం బ్రహ్మదేవి జడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఉమాశంకర్ మంచి కళాకారుడు కూడా! తెలుగుతల్లికి తనదైన ఆలోచనతో అభిషేకం చేయాలనుకున్నాడు. 20రోజులపాటు శ్రమించి 250 పెన్సిళ్ల ఉపయోగించి అందులోని కర్బనం మొనలతో 7సెంటీమీటర్ల ఎత్తు, మూడు సెంటీమీటర్ల వెడల్పుతో కర్బనం రథాన్ని తయారుచేసారు. అందులో చాకపీస్‌తో 1.5సెంటీమీటర్ల వెడల్పుతో తయారు చేసిన తెలుగుతల్లిని ప్రతిష్టించారు. రథానికి గొలుసులను సైతం పెన్సిల్ కర్బనంతో రూపొందించడం విశేషం.

దేశవిదేశాల నుండి ప్రపంచ తెలుగుమహాసభలకు వచ్చే అతిథులకు స్వాగతం పలుకుతున్నట్లు వుండేలా ఆయన ఈ రథాన్ని తీర్చిదిద్దారు. ఉమాశంకర్ కళాప్రతిభకు 'లాయర్' అభినందనలు.

## పెన్షనర్ల సంఘం
# జిల్లా అధ్యక్షుడిగా మోహన్‌రావు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడిగా విశ్రాంత వ్యవసాయశాఖ సహాయసంచాలకులు డా॥ పి.మోహన్‌రావును ఎన్నుకున్నారు. ఈ నెల 19వ తేదీన నెల్లూరులోని పెన్షనర్స్ భవన్‌లో జరిగిన సంఘం కార్యవర్గ సమావేశంలో సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మోహన్‌రావు గతంలో వ్యవసాయాధికారుల సంఘానికి, పెన్షనర్ల అసోసియేషన్‌కు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేసి వున్నారు. సర్వీసులో వున్నప్పుడు మంచి అధికారిగా మన్ననలు పొందారు. పింఛన్‌దారులకు హెల్త్‌కార్డులు, ఆధార్‌కార్డులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని, పెన్షనర్ల సంఘం భవన నిర్మాణానికి శ్రమిస్తానని ఈ సందర్భంగా మోహన్‌రావు 'లాయర్'కు తెలిపారు.

అలాగే అసోసియేషన్ నూతన కార్యవర్గానికి గౌరవాధ్యక్షులుగా ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, అసోసియేట్ అధ్యక్షులుగా ఒ.సుబ్బరాయుడు, ఉపాధ్యక్షులుగా సి.వి.రమణయ్య, ఒ.ఎస్.ప్రకాశం, ఎం.వి.చలం, బి.రామిరెడ్డి, ఒ.ఈధర్‌రాణి, డాక్టర్ ఎస్.మాలకొండయ్య, ప్రధానకార్యదర్శిగా టి.కొండాచారి, కోశాధికారిగా కె.అప్పారావు, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.వి.సుబ్రహ్మణ్యం, ఎ.నాగరత్నమ్మ, పి.గురునాధరావు, వై.ప్రభాకర్, జె.రామచంద్రయ్య, పి.ఆర్.రాధాకృష్ణమూర్తి, సభ్యులుగా వి.వెంకటేశ్వర్లు, ఎన్.సీతారామరాజు, కృష్ణారావు పంతులు, డి.ఎబినేజర్, కె.గోవిందయ్య, పి.సుబ్బరత్నమ్మ, టి.వి.రమణయ్య, సలహాదారులుగా ఏ.వి.నాగేశ్వరరావు, ఆర్.చెన్నకేశవులు, ఎ.సుందరరాజయ్య, సి.హెచ్.యానాదయ్యలను ఎన్నుకున్నారు.

# అగ్నిబాధితులకు శ్రీధర్ పరామర్శ



నెల్లూరు బి.వి.నగర్ ప్రాంతంలోని నక్కలగుంటలో అగ్ని ప్రమాదం సంభవించి నిరాశ్రయులైన బాధితులను వైయస్సార్ కాంగ్రెస్‌నాయకులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. బాధితులకు 70కిలోల బియ్యం, వంటసామాగ్రి, చీరలు, దుప్పట్లు అందజేశారు. భవిష్యత్‌లో బాధితులు కొత్త ఇళ్లు కట్టుకుంటే అందుకు తమవంతు సాయం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. వారికి ప్రభుత్వపరంగా కూడా సాయం అందించాలని ఆయన కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఘంటా డేవిడ్, జ్యోతిబాబు, మురుగేష్, చంద్రమ్మ, ఎం.శ్రీనివాసులు, మాథ్యూస్ తదితరులు పాల్గొన్నారు.

## నడక సంఘంలో నడతను గుర్తించి
# రాఘవేంద్రశెట్టికి అవార్డు



రాఘవేంద్రశెట్టిని సత్కరిస్తున్న ఆర్డీఓ మాధవీలత, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

నెల్లూరు దర్గామిట్టలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 16న వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యస్.రాఘవేంద్రశెట్టిని ఆర్.డి.ఓ మాధవీలత, రూరల్ డీఎస్పీ కె.బాలవెంకటేశ్వరరావు, డియస్‌డియంఓ ఆర్.కె.ఎథిరాజుల సమక్షంలో వాకర్స్ ఘనంగా సత్కరించారు. 2012 సంవత్సరంలో చేసిన పలుసేవా కార్యక్రమాలకు నెల్లూరు, ప్రకాశం, గుంటూరుజిల్లాల స్థాయిలో బెస్ట్ ప్రెసిడెంట్‌గా ఆయన ఎంపికై ఈనెల 8,9తేదీలలో హైదరాబాదులోని ఏపియస్ కళాభవన్‌నందు 21వ వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో 5,000/-నగదుతో అవార్డు పొందినందుకు అభినందిస్తూ ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆయనను సత్కరించింది. కార్యక్రమంలో కార్యదర్శి బలరామయ్యనాయుడు, కోశాధికారి స్వర్ణా రమేష్, డాక్టర్ కె.అంకిరెడ్డి, వి.హజరత్‌బాబు, వి.అరుణాచలం, వెంకయ్య, నరసింహారెడ్డి, నందగోపాల్, శేషగిరిరావు, డాక్టర్ దొరస్వామినాయుడు, వి.రంగారావు మొదలగు 'వాకర్స్' సభ్యులు పాల్గొన్నారు.

# కన్నులపండుగగా దేవదేవుని కల్యాణం



ఈ నెల 17వతేదీ నెల్లూరు నగరంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణమండపంలో శ్రీవారి శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీనివాస కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితులు సూర్యనారాయణ స్వామి ఆధ్వర్యంలో గిరిధర్, చైతన్య స్వామిలు వేదమంత్రోచ్ఛారణలతో శ్రీదేవి భూదేవి సమేత స్వామివారిని కల్యాణ మండపంపై ప్రతిష్ఠించి అంగరంగ వైభవంగా ఈ వేడుకను జరిపించారు. ప్రపంచ తెలుగుసమాఖ్య రీజినల్ కో-ఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, శ్రీమతి పద్మావతి దంపతులు, నలుబోలు వెంకటరమణారెడ్డి, శ్రీమతి శైలజ దంపతులు ఉభయ కర్తలుగా అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ వేడుకను నిర్వహించారు. శ్రీకృష్ణ మానసచరిత మండలి నిర్వాహకులు నారా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు తిరునామాలు దిద్దడం, గుండాల గురవయ్యస్వామి బృందం ఆలపించిన అన్నమయ్య కీర్తనలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. యశోదకృష్ణ భజన మండలి, శ్రీ హరిహరనాథ భజన మండలి వారు చేసిన కోలాట నృత్యాలు అబ్బురపరచాయి. కుమారి లాస్య ప్రదర్శించిన భరత నాట్యం అందరినీ ఆకట్టుకుంది. శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణం రోజున వైభవంగా జరిగిన కల్యాణాన్ని వీక్షించి పునీతులయ్యేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

తిరుమల తిరుపతి దేవస్థానం, హిందు ధర్మప్రచార పరిషత్ ధార్మిక సలహామండలిల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఏడుకొండలవాని కల్యాణవేడుకలో వాకాటి విజయకుమార్‌రెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ అధినేత వీరిశెట్టి హజరత్‌బాబు, 'మయూరి' సుబ్బారావు, 'లాయర్' ప్రభు, ధనుంజయ, వీరిశెట్టి సుధాకర్, హరినాథ్, శ్రీహరి, రాంగోపాల్, ప్రేమ్‌కుమార్, బి.వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో ఎన్నికల పో(జో)రు

ఆర్టీసీలో కార్మికసంఘాల గుర్తింపు ఎన్నికలకు రంగం సిద్ధమైంది. అసెంబ్లీ ఎన్నికలలో వివిధ రాజకీయపార్టీల మధ్య నెలకొన్నట్లుగానే వివిధ ఆర్టీసీ కార్మికసంఘాల మధ్య ఉత్కంఠ పోరు నెలకొంది. ఈ నెల 22న ఎన్నికలు జరుగనున్నాయి. జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపో ప్రాంగణాలలో వివిధ కార్మికసంఘాలు ఉధృతస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నాయి. డిపోలలో, బస్టాండ్‌లలో కార్మికసంఘాల వాల్‌పోస్టర్‌లు, బ్యానర్లు దర్శనమిస్తున్నాయి. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్, భారతీయ కార్మిక సంఘ్, ఐఎన్‌టీయుసి, టీఎన్‌టియూసిలు రంగంలో వున్నాయి. జిల్లాలో గుర్తింపు కోసమే కాకుండా రాష్ట్రస్థాయి గుర్తింపు కోసం కూడా ఈ యూనియన్‌లు హోరాహోరీ తలపడుతున్నాయి. ఆర్.ఎం కార్యాలయంతో పాటు జిల్లాలోని 10ఆర్టీసీ డిపోల ఉద్యోగులు, ఇడి కార్యాలయం, పడుగుపాడు జోనల్ కార్యాలయం ఉద్యోగులు మొత్తం 4699మంది ఈ ఎన్నికలలో ఓట్లు వేయనున్నారు.

PDF Compressor Free Version



సహకార ఎన్నికలు

# వైకాపాలోనే మేకపాటికి గట్టిపోటీ


వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ పరంగా జిల్లాలో ఆధిపత్యం చెలాయిస్తున్న మేకపాటి సోదరులు జిల్లా కేంద్రసహకారబ్యాంకుపై కన్నేసారు. సహకార ఎన్నికలలో వైకాపా జెండాను ఎగురవేయడమే కాదు, డీసీసీబి ఛైర్మెన్ కుర్చీని సైతం తమ ఇంట్లోనే వుంచుకునే విధంగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికే వాళ్లింట్లో మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఎంపీగాను, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యేగాను వున్నారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డి తనయుడు గౌతమ్‌రెడ్డి కూడా వైకాపాలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. వచ్చే ఎన్నికలలో ఆయన కూడా ఎంపీగా లేదా ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాలున్నాయి. మేకపాటి రాజగోపాల్‌రెడ్డికే ఏ పదవీ లేదు. రేపు జరుగనున్న సహకార ఎన్నికలలో ఆయనను రంగంలోకి దించే ప్రయత్నం జరుగుతుంది. మర్రిపాడు మండలంలో బూదవాడ సొసైటీ నుండి ఆయనను నిలబెట్టి గెలిపించి, తద్వారా బ్యాంకు ఛైర్మెన్‌గా చేయాలనుకుంటున్నారు. అయితే ఇలా జరిగితే వైయస్సార్ కాంగ్రెస్‌ను మేకపాటి కుటుంబానికి కాంట్రాక్టునిచ్చారనే విమర్శలు రాక తప్పవు.



వైయస్సార్ కాంగ్రెస్‌లో ఒకే కుటుంబానికి పదవులు పరిమితమవుతున్నాయనే అపవాదు వస్తుంది. ఈ దృష్ట్యా మేకపాటి వాళ్ల ఆలోచన ఎంతవరకు ఫలిస్తుందో చూడాలి. అలాగే నల్లపరెడ్డి ప్రసన్న ముఖ్య అనుచరుడైన కొడవలూరు మండలం నాయకుడు ఎన్.శ్రీనివాసులురెడ్డి పేరు కూడా డీసీసీబీకి బలంగా వినిపిస్తుంది. మరోపక్క పార్టీ జిల్లా కన్వీనర్‌గా వున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి వర్గీయులు కూడా డీసీసీబీపై మనసు పడుతున్నారు. శాసనమండలి ఎన్నికలలో మేకపాటి వర్గానికి చెందిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని నిలబెట్టాం కాబట్టి డీసీసీబీలో తమ అనుచరులను నిలబెట్టుకోవాలనే ఆలోచనలో కాకాణి వర్గం వుంది. వైకాపాలో అంతర్గతంగా జరుగుతున్న వర్గపోరు సహకార ఎన్నికలలో ప్రత్యక్షంగా వేదికనెక్కే అవకాశాలున్నాయి.

# మంత్రికి సవాల్‌గా మర్రిపాడు

సహకార ఎన్నికలలో మర్రిపాడు మండలం అత్యంత కీలకం కాబోతుంది. రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రాతినిధ్యంలోని ఆత్మకూరు నియోజకవర్గం పరిధిలో ఈ మండలం వుంది. కాగా నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆయన సోదరుడు, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిల సొంత మండలం కూడా ఇదే! ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నాడు కాబట్టి ఆనం రామనారాయణరెడ్డికి, సొంతమండలం కాబట్టి మేకపాటి సోదరులకు ఈ మండలంలో సహకార సంఘాల ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం కానున్నాయి. మర్రిపాడు మండలంలో బూదవాడ, భీమవరం సొసైటీలున్నాయి. బూదవాడ సొసైటీ ఎప్పుడూ మేకపాటి సోదరుల చేతుల్లోనే వుండేది. భీమవరం ఎవరు అధికారంలో వుంటే వారి చేతులకు దక్కుతుండేది. ఇప్పుడు అటు మంత్రి ఆనంకు, ఇటు వైకాపాలో కీలకపాత్ర పోషిస్తున్న మేకపాటి సోదరులకు ఈ రెండు సొసైటీలు కీలకమయ్యాయి. బూదవాడ నుండి మేకపాటి కుటుంబసభ్యులే పోటీకి దిగే అవకాశాలున్నాయి. ఈ రెండు సొసైటీలను గెల్చుకోలేకపోతే వైకాపాలో మేకపాటి సోదరుల పరువు పోతుంది. ఆధిపత్యం దెబ్బతింటుంది. సొంత మండలంలో సొసైటీలను గెలుచుకోలేని వాళ్లు జిల్లాలో పార్టీని ఏం ఉద్ధరిస్తారనే ప్రశ్న వస్తుంది. కాబట్టి సర్వశక్తులు ఒడ్డి వాళ్లు ఆ రెండు సొసైటీలను గెలుచుకోవాల్సిందే.



అదెంతవరకు సులభం? సొసైటీలలో పరిమిత ఓటర్లుంటారు. గాలులు, ప్రభంజనాలు పెద్దగా పనిచేయవు. స్థానిక నాయకత్వాలు ముఖ్యం. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా మేకపాటి సొంతమండలంలో వారిని దెబ్బకొట్టాలని చూస్తున్నాడు. సహకార ఎన్నికలకు మర్రిపాడు మండల కాంగ్రెస్ నాయకులను సమాయత్తం చేస్తున్నాడు. స్థానికంగా బలమైన అభ్యర్థులను రంగంలోకి దించి మేకపాటికి ఇక్కడ చెక్‌పెట్టే విధంగా పావులు కదుపుతున్నారు.

# పోటీలో దబ్బల!

వైయస్సార్ కాంగ్రెస్ తరపున సహకార ఎన్నికలకు నాయకులు చాలా తొందరగా రెడీ అవుతున్నారు. జిల్లాలోని 99సొసైటీలకు కూడా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. ముఖ్యంగా జిల్లా కేంద్రసహకార బ్యాంకు ఛైర్మెన్ పదవి కోసం కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీలలో పెద్దగా పోటీలేదు. కాని వైయస్సార్ కాంగ్రెస్‌లో మాత్రం రెండువర్గాల మధ్య పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తుంది. మేకపాటి వర్గం తమ సోదరుడు రాజగోపాలరెడ్డిని పోటీలో నిలిపే ప్రయత్నం చేస్తుంది. అయితే మరో వర్గం మాత్రం గూడూరు డివిజన్ నుండి దబ్బల రాజారెడ్డికి మద్దతు పలుకుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే సూళ్లూరుపేట వ్యవసాయపరపతి సంఘానికి ఆయన పేరును ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. గత డీసీసీబీ ఛైర్మెన్ వాకాటి నారాయణరెడ్డి కూడా ముందుగా ఈ సొసైటీ అధ్యక్షుడిగానే ఎన్నికయ్యారు. శాసనమండలి ఎన్నికలలో కావలికి చెందిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని పెట్టారు కాబట్టి డీసీసీబీని తమకు వదిలేయాలని గూడూరు డివిజన్ నాయకులు కోరే అవకాశముంది. సూళ్లూరుపేట, గూడూరు ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు కాబట్టి అగ్రవర్ణ నాయకులకు ఎమ్మెల్యేల ఛాన్స్ వుండదు. తెలుగుదేశం, కాంగ్రెస్‌లు డీసీసీబీ ఛైర్మెన్ విషయంలో రిజర్వ్‌డ్ నియోజకవర్గాలకు చెందిన అగ్రవర్ణనాయకులకే ప్రాధాన్యతనిస్తుండేవి. ఆ కోణంలో ఇప్పుడు దబ్బల రాజారెడ్డిని బలంగా ప్రతిపాదిస్తున్నారు.




# తెరపైకి జయ



సహకార సంఘాల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ నుండి అనూహ్యంగా ఆనం జయకుమార్‌రెడ్డి పేరు వినిపిస్తుంది. డీసీసీబీ ఛైర్మెన్ రేసులో ఆయనను నిలబెట్టాలనే దిశగా కాంగ్రెస్‌లో ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిద్వారా తమ కుటుంబంలో వచ్చిన స్వల్ప అంతరాలను తొలగించుకోవాలనే ఆలోచనలో ఆనం సోదరులు వున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో ఎన్నో రాజకీయ కుటుంబాలున్నాయి. ఎందరో అన్నదమ్ములు రాజకీయాలలో వున్నారు. ప్రతి కుటుంబంలోనూ సోదరుల మధ్య లేదా కుటుంబసభ్యుల మధ్య రాజకీయంగా విభేదాలు వచ్చేవున్నాయి. కాని ఆనం సోదరులు నలుగురూ మొదటి నుండి ఒకే బాట, ఒకే మాట అన్నట్లుండేవారు. ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు ఎప్పుడు ఏ ఎన్నికలలో పోటీచేసినా వారి గెలుపుకోసం వారి తమ్ముళ్లు ఆనం జయకుమార్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డిలు తీవ్రంగా శ్రమించేవాళ్లు.

అయితే కొద్దికాలం క్రితం నుండి ఆనం జయకుమార్‌రెడ్డి రాజకీయాలకే దూరంగా వుంటున్నాడు. తన అన్న వివేకా మీద ఎందుకో ఆయన అలిగి దూరంగా వుంటున్నాడు. ఒక దశలో ఆయన వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరతాడనే ప్రచారం కూడా వచ్చింది. కాని ఇంతవరకు రాజకీయంగా ఆయన ఏ నిర్ణయం తీసుకోలేదు. ఇటీవల వివేకా కొంత అనారోగ్యానికి లోనుకావడం (మిగతా 5వ పేజీలో)

# ప్రాణాంతకమవుతున్న ప్లాస్టిక్




- పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం
- భయంకర వ్యాధులను డబ్బులుపెట్టి కొంటున్నాం
- మన అలవాట్లే మన దుంపతెంచుతాయి
- మూగజీవాలను మింగేస్తున్న ప్లాస్టిక్‌భూతం

**టిఫిన్ సెంటర్‌కిపోయి... వేడివేడిగా ఇడ్లీలో, దోశలో పార్శిల్ చేయిస్తాం... పేపరుమీద ప్లాస్టిక్‌కవర్ వేసి ఇడ్లీ లేదా దోశె పెడతాడు. దానిమీద మరో పాలిథిన్ కవర్ పెట్టి చట్నీ వేసి పార్శిల్ కడతాడు. దానిని ఇంటికి తెచ్చుకుని "ఆహా ఏమి రుచి... అనరా మైమరచి" అని పాడుకుంటూ తింటాం. మనం తినడమే కాదు, మన పిల్లలకూ తినిపిస్తాం... మనం ఆ ప్యాకెట్‌లో తెచ్చింది కేవలం టిఫినే కాదు మనతోపాటు మన కుటుంబసభ్యులకు రోగాలను కూడా!**

పాలిథిన్ కవర్‌తో వేడి వేడి టిఫిన్‌ను చుట్టేస్తారు. ఆ వేడికి మనకు తెలియకుండా పాలిథిన్‌లోని విషపదార్థాలు కొంత కరిగి ఆహారపదార్థాలలో కలుస్తాయి. వాటినే మనం తింటున్నాము. అంతెందుకు టీ కొట్టు వద్దకుపోతే ఇంతకుముందు పింగాణి కప్పుల్లోనో, గాజుగ్లాసుల్లోనో, స్టీలు గ్లాసులోనో టీ ఇచ్చేవాళ్లు. ఇప్పుడంతా డిస్పోజబుల్ కప్‌లే! ఇవి కూడా ప్లాస్టిక్‌తో తయారుచేయబడి వుంటాయి. టీని ఆ కప్పులో పోసినప్పుడు ఆ వేడికి ఆ ప్లాస్టిక్ కప్పులోని రసాయనాలు కరిగి టీలో కలుస్తాయి. ఆ టీనే మనం తాగుతున్నాం.

ఈరోజు ప్లాస్టిక్ జనజీవన నిత్యకృత్యాలలో ఒక భాగం అయిపోయింది. నిద్రలేచింది మొదలు పాల కోసం వెళ్లినప్పుడు, కూరగాయలు లేదా మాంసం తేవడానికి మార్కెట్‌కు వెళ్లినప్పుడు, సరుకుల కోసం చిల్లరకొట్టుకు వెళ్లినప్పుడు, చీరలు కొనడానికి షాపింగ్‌మాల్‌కు వెళ్లినప్పుడు... ఇలా ప్రతిచోటా మనకు ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తూనే వున్నాయి. ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని అధికారయంత్రాంగం ఎంతగా చర్యలు చేపట్టినా, ఎన్ని విధాలుగా దాడులు నిర్వహించినా ఆశించిన ఫలితం కనిపించడంలేదు. ఎందుకంటే దుకాణదారులు వాటిని అమ్మకూడదని అనుకున్నా కొనుగోలుదారులు వాటికి అలవాటుపడిపోయి వున్నారు. షాపులో క్యారీబ్యాగులు లేవంటే మరోషాపుకు పోతున్నారు. దీనివల్ల వ్యాపార పోటీతత్వంతో దుకాణాల యజమానులు చాటుమాటుగానైనా క్యారీబ్యాగులు వుంచుకోవాల్సి వస్తుంది. ప్లాస్టిక్‌సంచులు పర్యావరణం పాలిట ప్రధానశత్రువు. ప్లాస్టిక్ మట్టిలో కలిసిపోవాలంటే లక్ష ఏళ్లు పడుతుంది. ఈ క్యారీబ్యాగులు తిని ఎన్నో ఆవులు, గేదెలు చనిపోవడం ఇటీవలకాలంలో (మిగతా 5వ పేజీలో)





## పురంధేశ్వరి సాధించారు

తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో రెపరెపలాడించిన తెలుగు తేజం, తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక స్వర్గీయ ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్. ఆ మహనీయ విగ్రహాన్ని పార్లమెంటులో నెలకొల్పేందుకు అనుమతి సాధించిన కేంద్రమంత్రి దగ్గుబాటి పురందేశ్వరి అభినందనీయురాలు. 9ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా, 2004 నుండి ప్రతిపక్ష నాయకుడిగా కొనసాగుతూ కేంద్రంలో ఎన్.డి.ఎ ప్రభుత్వానికి మద్దతునిచ్చి స్పీకర్ పదవిని పొంది యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర నిర్వహించి కేంద్రంలో మంత్రి పదవులు తన వారికి ఇప్పించుకున్న నారా చంద్రబాబునాయుడు పార్టీ వ్యవస్థాపకులు తమకు రాజకీయ భిక్షపెట్టిన ఎన్.టి.ఆర్. విగ్రహ ఏర్పాటుకు ఎటువంటి చొరవ చూపకపోగా విగ్రహాన్ని నెలకొల్పేందుకు అనుమతి సాధించిన పురందేశ్వరిపై అనుచితప్రచారం చేయడం సముచితం కాదు.

ఎన్.బాబురావు, కావలి.

## అక్కడ వుంచి.. ఇక్కడ కట్ చేస్తే ఏం లాభం

సినిమాలలో కొన్ని అసభ్యకరమైన మాటలు, బూతు డైలాగులు, ద్వంద్వార్థాలతో కూడిన పదాలు వుంటాయి. సెన్సార్ బోర్డు వాటిని మాత్రం కట్ చేయదు. సినిమాలలో అలాగే వుంటాయి. వీటిని ప్రేక్షకులు చూసేస్తారు. ఆ సినిమాలను టీవీలలో ప్రసారం చేసేటప్పుడు మాత్రం ఆ డైలాగులు వచ్చినప్పుడు సైలెన్స్ చేసేస్తున్నారు. సినిమా విడుదలకాకముందే అలాంటి అభ్యంతరకర మాటలను తొలగించాలి.

పోలిరెడ్డి వేణు, నాయుడుపేట.

## రూపాయి బియ్యం ఎత్తేయండి

రూపాయికే కిలోబియ్యం దండగమారి పథకం. కిరణ్‌కుమార్ రెడ్డి ఇది నేను చేస్తున్న పెద్ద ఘన కార్యం అనుకుంటున్నారు. నిజానికి పేదలకు పెద్దగా ఒరుగుతున్నదేమీ లేదు. దీనివల్ల ఎవరు లబ్ధిపొందుతున్నారు. ప్రభుత్వంపై కోట్ల రూపాయల భారం. రూపాయి బియ్యాన్ని ఎత్తేయడం [illegible].

బి.నారాయణరెడ్డి, ఆత్మకూరు.

## 'ప్రభా'తం

# పాక్ జోలపాట



పిల్లి గుడ్డిదైతే ఎలుక క్యాబరే డ్యాన్స్ చేసినట్లుగా వుంది భారత్ అంతర్గత విషయాలలో పాకిస్తాన్ వ్యవహారం. దేశంలో వున్న భిన్నమతాల సంస్కృతిని ప్రపంచమే గౌరవిస్తుండగా పాకిస్తాన్ మాత్రం ఇక్కడి మతఉద్రేకాలను రెచ్చగొట్టడం ద్వారా లబ్ధిపొందాలనుకుంటుంది.

పాకిస్తాన్‌కు మనం స్నేహహస్తం అందిస్తాం... అది ఆ చేయిని కొరుకుతూనే వుంటుంది. పిచ్చోడితో స్నేహం పనికి మాలినపని అని తెలిసినా మనం ఆ పనిని చేయకుండా వుండలేకపోతున్నాం. పాకిస్తాన్‌తో స్నేహం ఈ దేశంలోని రాజకీయ పార్టీలకు, ముఖ్యంగా అధికారంలో వున్నవారికి ఒక నిత్యావసరవస్తువుగా మారిపోయింది. కాబట్టే మైనార్టీల ఓట్లను అమితంగా ప్రేమించే కాంగ్రెస్ అయినా, పాకిస్తాన్‌ను విపరీతంగా ద్వేషించే బీజేపీ అయినా అధికారంలోకి రాగానే పాకిస్తాన్‌తో స్నేహం చేయటం ఒక ఫ్యాషన్‌గా భావిస్తున్నాయి. మనం స్నేహహస్తం చాపుతుండడం పాకిస్తాన్‌కు పెద్ద అలుసైపోయింది.

ఈమధ్య పాక్ హోంశాఖమంత్రి రెహ్మాన్ మాలిక్ భారత్ పర్యటనకొచ్చి వుండు మీద కారం చల్లినట్లుగా మాట్లాడారు. భారత్‌లో ఉగ్రవాద చర్యలకు మతహింసే కారణమంటూ అసందర్భప్రేలాపన చేసాడు. ముంబై పేలుళ్లకు బాబ్రీమసీదు విధ్వంసంతో లింకుపెట్టాడు. పిల్లి గుడ్డిదైతే ఎలుక క్యాబరే డ్యాన్స్ చేస్తుందన్నట్లుగా వుంది పాక్ హోంమంత్రి వ్యవహారం. భారత్ అంతర్గత విషయాలలో ఆయన అంతగా తలదూర్చడానికి కారణం మన రాజకీయపార్టీల వైఖరే! వీళ్ల ఓట్లబ్యాంకు రాజకీయాలే! బాబ్రీమసీదుకు ముంబై దాడులకు సంబంధమేంటి? బాబ్రీ మసీదు భారత భూభాగంలోనిది. అప్పుడెప్పుడో బాబర్ దండెత్తి వచ్చి అక్కడున్న ఆలయాన్ని ధ్వంసం చేసి మసీదును కట్టారని ఇక్కడి మెజార్టీ వర్గీయుల విశ్వాసం. అయితే ఆ కాలంలో ఆలయం కూల్చారని చెప్పి ఈకాలంలో అక్కడవున్న మసీదును కూలదోయడం విచారకరమే! మనం త్రికరణశుద్ధిగా రాసుకుని నమ్ముతున్న రాజ్యాంగ విలువలకు విరుద్ధమే. అయినా ఇది అంతర్గత వ్యవహారం. భారతదేశంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అన్న తేడా లేకుండా అందరికీ సమానహక్కులు కల్పించబడ్డాయి. ఈ దేశం ఒక వర్గానిదో, ఒక మతానిదో అన్న పరిస్థితి లేదు. ప్రథమశ్రేణి పౌరులు, ద్వితీయశ్రేణి పౌరులు అనే తేడాలు లేవు. ఒక మతానికి ఒక రకంగా, ఇంకో మతానికి మరోరకంగా హక్కులు లేవు. ఇంకా లోతుకుపోతే ఈ దేశంలో మెజార్టీ వర్గీయులకంటే కూడా మైనార్టీ వర్గాల సంక్షేమానికే ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. పాకిస్తాన్‌లో హిందువులు ద్వితీయశ్రేణి పౌరులు, ముస్లింలకు వున్న హక్కులు అక్కడ హిందువులకు వుండవు.

భారత్, పాక్‌లకు ఒకేసారి స్వాతంత్ర్యం వచ్చింది. దేశవిభజన జరిగిన తర్వాత పాకిస్తాన్‌లో వున్న హిందువుల సంఖ్య క్రమంగా తగ్గిపోతే, భారత్‌లో వున్న ముస్లింల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. పాకిస్తాన్‌లో మైనార్టీల హక్కులను కాలరాస్తున్నారు తప్పితే వాళ్ల [illegible] ప్రత్యేకంగా చేసిందేమీ లేదు. గతంలోనూ పాకిస్తాన్‌లో ఎన్నో ఘోరాలు చూసాం. హిందూ బాలికలను అపహరించడం, వారిని మతం మార్చి బలవంతంగా పెళ్లిళ్లు చేసుకోవడం, అక్కడక్కడా వున్న హిందూ దేవాలయాలపై దాడులు చేయడం. కాని భారతదేశంలో బాబ్రీమసీదు విధ్వంసం తప్పితే మతపరమైన కట్టడాలపై ఎటువంటి దాడులు జరగలేదు. దేశచరిత్రలో గుజరాత్ అల్లర్లు మాత్రం మాయని మచ్చగానే మిగిలిపోయి. అవి కూడా గోద్రా ఎక్స్‌ప్రెస్ దుర్ఘటనతో ఉద్రేకంలో జరిగినవే. బాబ్రీ మసీదు విధ్వంసమైనా, గుజరాత్ అల్లర్లైనా భారత కోర్టులలో వాటిపై న్యాయవిచారణ జరుగుతూనే వుంది. గుజరాత్ అల్లర్లలో ఇప్పటికే పలువురు దోషులకు కఠిన శిక్షలు పడ్డాయి కూడా! బాబ్రీమసీదును కూలగొట్టినప్పుడే ఆరు రాష్ట్రాలలో బీజేపీ ప్రభుత్వాలపై వేటు వేసారు. ఆ రోజుపై ప్రత్యేకదర్యాప్తును వేసున్నారు. కాని పాకిస్తాన్‌లోని హిందువులపై జరుగుతున్న దాడుల విషయంలో ఎప్పుడైనా అక్కడి ప్రభుత్వం స్పందించిందా? అలాంటి రోజులా... భారత్‌లో మతహింస గురించి మాట్లాడేది! అసలు భారత్ అంతర్గత వ్యవహారాలతో పాకిస్తాన్‌కు పనేంటి? ఈ ప్రపంచంలో చాలా దేశాలలో ముస్లింలున్నారు. పాకిస్తాన్‌లో కంటే కూడా ముస్లిం జనాభా భారత్‌లోనే ఎక్కువ. ప్రపంచ వ్యాప్తంగా వున్న ముస్లింలకు పాకిస్తాన్ ప్రతినిధి కాదు. ఇక్కడున్న ముస్లింలు ఈ దేశంలో అంతర్భాగంగా వున్నారు. కాని వారిని మతపరంగా విడదీసే ఒక కుయుక్తికి పాక్ హోం మంత్రి శ్రీకారం చుట్టారు.

భారత్‌లో జరుగుతున్న ఉగ్రవాద దాడులకు మూలాలు పాకిస్తాన్‌లోనే వున్నాయి. చాందసభావాలను ప్రేరేపించి యువతను లొంగదీసుకుని పాక్ కేంద్రంగా పనిచేస్తున్న కొన్ని సంస్థలు ఉగ్రవాదులను తయారు చేస్తున్నాయి. ముంబైదాడుల నిందితుడు, ఉరిశిక్ష అమలుచేయబడ్డ అజ్మల్ కసబ్ ఈ కోవకు చెందిన యువకుడే! ఇలాంటి తీవ్రవాద గ్రూపులకు పాకిస్తాన్ ఇంటలిజెన్స్ సంస్థ ఐఎస్ఐ అండదండలున్నాయనేది జగమెరిగిన సత్యం. కాని ఆ తీవ్రవాద శిక్షణా శిబిరాలను నిర్మూలించగల స్థితిలో పాకిస్తాన్ ప్రభుత్వం లేదు. అక్కడి పాలకులు ఎవరైనా పాకిసైన్యం, తీవ్రవాద సంస్థల చేతుల్లో కీలుబొమ్మలుగా వుండాల్సిందే! సైన్యానికి అడ్డం తిరిగారంటే ఎవరైనా పదవీచ్యుతులు కావాల్సిందే! భారతదేశంలో ప్రజాస్వామ్యం నడుస్తుంటే పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యం ముసుగులో సైనికస్వామ్యం నడుస్తుంది. తమ దేశంలో ఒకటి అరాశాతం వున్న మైనార్టీల భద్రత పట్టించుకోని పాకిస్తాన్‌కు భిన్నసంస్కృతుల సమ్మేళనంతో, సకల మతాల విశ్వాసాలతో విరజిల్లుతున్న భారత్ వైపు వేలెత్తిచూపే అర్హత వుందా?

## అంతర్'జాతీయం

- ఈ నెల 14న అమెరికా కనెక్టికట్‌లోని ఓ ప్రాథమిక పాఠశాలలో ఆడమ్‌లాంజా(20) అనే ఉన్మాది విచక్షణా రహితంగా జరిపిన కాల్పుల్లో 27మంది చనిపోయారు. వారిలో 20మంది పిల్లలే. వీరితోపాటు ఉన్మాది కూడా తనను తాను కాల్చుకుని చనిపోయాడు. ఈ సంఘటన పట్ల అధ్యక్షుడు ఒబామా తీవ్ర ఆవేదనకు లోనై ఏడ్చేసారు.
- భారత పర్యటనలో పాకిస్తాన్ హోంశాఖ మంత్రి రెహ్మాన్‌మాలిక్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసారు. భారత్‌లో మతహింస ఉగ్రవాదానికి దారితీస్తుందన్నారు. ముంబై దాడులకు బాబ్రీ విధ్వంసమే కారణమన్నట్లు మాట్లాడారు. అంతేకాక భారత భద్రతా దళాలు అప్రమత్తంగా లేకపోవడం వల్లే ఉగ్రవాద దాడులు జరుగుతున్నట్లు మాట్లాడారు. మాలిక్ వ్యాఖ్యలపై ప్రతిపక్ష బీజేపీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది.
- ఈ నెల 15న ఢిల్లీలో ప్రత్యక్ష నగదుబదిలీ పథకాన్ని యూపిఏ చైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ ప్రారంభించింది. దీనికి 'ఢిల్లీ అన్నశ్రీ యోజన' అని పేరు పెట్టారు.
- పదోన్నతులలో రిజర్వేషన్ల బిల్లుకు సోమవారం రాజ్యసభలో ఆమోదం లభించింది. 245మంది మద్దతు పలికారు. సమాజ్‌వాదీ సభ్యులు మాత్రం ఈ బిల్లును వ్యతిరేకించారు.
- ఇటలీ మాజీప్రధాని బెర్లుస్కోని(76) త్వరలో తన మనుమరాలి వయసుండే టీవీ వ్యాఖ్యాత ఫ్రాన్సెస్కాపాస్కల్(28)ని వివాహమాడనున్నారు. ఆమె ఆయనకంటే 50ఏళ్లు చిన్నది. దీనికి సంబంధించి వారికి నిశ్చితార్థం కూడా జరిగింది.
- రైల్వేస్టేషన్లు, రైల్వేప్లాట్‌ఫారాల ఆవరణలలో చెత్తవేయడం, ఉమ్మివేయడం ఇతరత్రా అపరిశుభ్ర పనులు చేసేవారికి భారీగా జరిమానాలు విధించాలని రైల్వేశాఖ నిర్ణయించింది.
- మెడికల్ ఎంట్రన్స్ టెస్టును తెలుగులో కూడా రాయొచ్చని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి గులాంనబీ ఆజాద్ స్పష్టం చేశారు. మంగళవారం రాజ్యసభలో ఎంపీలు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ నీట్ పరీక్షను హిందీ, ఇంగ్లీష్‌లతో పాటు గుజరాతి, మరాఠీ, బెంగాలీ, తమిళం, తెలుగు భాషల్లో కూడా రాయవచ్చునని వెల్లడించారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- తెలంగాణ కోసం కేసీఆర్ చేసిందేమీ లేదు. - చంద్రబాబు

వ్యాఖ్య :- ముందుగా ఢిల్లీలో పడుకోవడం తప్ప... అంటారు!

వార్త :- వై.యస్. వుంటే రాష్ట్రం ఇంకా ప్రగతి సాధించేది.

- చీరాలలో వై.యస్. విగ్రహావిష్కరణ సభలో రోశయ్య

వ్యాఖ్య :- కాని మీకు పదవుల ప్రగతి వుండేది కాదు.

వార్త :- రాష్ట్రానికి ఏం చేసారు..? - చంద్రబాబుపై ధ్వజమెత్తిన గండ్ర

వ్యాఖ్య :- హైటెక్ సిటీ కట్టించాడు... 60వేల కోట్లు అప్పు చేసాడు... చాలదా?

వార్త :- మోడీవి ఉద్రేక రాజకీయాలు. - రాహుల్ ద్రావిడ్(?)

వ్యాఖ్య :- మీవి వాటి నుండి ఓట్లు రాబట్టుకునే రాజకీయాలు.

వార్త :- రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా?

- నిర్మల్ జనారంగసభలో వై.యస్.విజయమ్మ

వ్యాఖ్య :- ప్రజలకున్న సందేహమే మీకూ వచ్చినట్లుందే!

వార్త :- సమస్యల్లేకపోతే దేవుణ్ని మర్చిపోతారు.

- విశాఖ ఇందిరమ్మబాటలో సీఎం.

వ్యాఖ్య :- అందుకేనా, జనాలు దేవుణ్ణి మర్చిపోకుండా చేస్తున్నారు.

వార్త :- రాష్ట్రంలో అమలవుతున్నవన్నీ కాంగ్రెస్ పథకాలే! - బొత్స

వ్యాఖ్య :- పథకాలేమోగాని వస్తువుల మాత్రం మీవే!

వార్త :- కాంగ్రెస్‌లో సమర్థులకు స్థానం లేదు. - ఎంపీ కావూరి

వ్యాఖ్య :- అందుకే పార్టీలోవున్న వాళ్లు అసమర్థులుగా కనిపిస్తేనే పదవులొస్తాయి.

వార్త :- రేపిస్టులకు ఉరే సరి. - లోక్‌సభలో సుష్మా స్వరాజ్

వ్యాఖ్య :- పార్లమెంట్ మీద దాడి చేసినోళ్లకే ఆ శిక్ష వేయడం లేదు..!

వార్త :- తెలుగుభాషాభివృద్ధికి ప్రత్యేకశాఖ. - రాష్ట్ర ప్రభుత్వం యోచన

వ్యాఖ్య :- దానిని కూడా తెలుగు రాని సీఎం కంట్రోల్‌లోనే పెడితే సరి.

వార్త :- వాల్‌మార్ట్‌కు అమ్ముడుపోయిన ఎంపీలు.

- బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి.

వ్యాఖ్య :- ఎంపీలు అయ్యిందే అందుకు కదా!

PDF Compressor Free Version



# ఆడబిడ్డల కోసం... రావమ్మా మహాలక్ష్మి



గర్భిణీస్త్రీకి చిన్నారి చేత ఆహారం తినిపిస్తున్న కలెక్టర్ బి.శ్రీధర్, డీఎం అండ్ హెచ్ఓ మాశిలామణి

తల్లిబిడ్డల సంరక్షణకోసం ఏర్పాటు చేసిన కార్యక్రమమే రావమ్మా మహాలక్ష్మి అన్నారు జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్. 17వతేదీ ముత్తుకూరు మండలకేంద్రం, వెంకటాచలం మండల పరిధిలోని ఇస్కపాళెంల్లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో రావమ్మా మహాలక్ష్మి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ కార్యక్రమం ద్వారా పేద వర్గాల గర్భవతులను గుర్తించి సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నమోదుచేసి వారికిచ్చిన నమోదు పుస్తకం ప్రకారం పరీక్షలు నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రులలోనే కాన్పులు జరిగేలా అవసరమైన వైద్య సౌకర్యాలను ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. గర్భిణీస్త్రీలకు అవసరమైన పరీక్షలు, నిర్వహించడంతో పాటు తగిన మందులను కూడా సిద్ధంగా వుంచబడతాయని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో మాతా, శిశు మరణాలను నివారించేందుకు స్వయంసహాయక గ్రూపు మహిళల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రభుత్వం అమలు చేసే వైద్యసేవాకార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలుచేయడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. గర్భిణీస్త్రీలకు నమోదు చేసినప్పటి నుండి కాన్పులు అయ్యేంతవరకూ ఒక్కొక్కరికి 2008 రూపాయలు వెచ్చించడంతో పాటు వారితో పాటు వచ్చిన సహాయకులకు భోజనవసతి కల్పించడం, అలాగే రాష్ట్ర ప్రభుత్వం వినూత్నరీతిలో ఇందిరమ్మ అమృతహస్తం కార్యక్రమం ద్వారా మధ్యాహ్నభోజనంతో పాటు ఒకగుడ్డు ఇవ్వడం జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా॥మాశిలామణి, ముత్తుకూరు తహసిల్దార్ సుశీలమ్మ, ప్రత్యేక హెల్త్ ఆఫీసర్ ఏ.ఇష్లోరెన్స్, ఐసిడియస్ పిడి విజయలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# "బంగారు"తల్లి బండారు మాణిక్యమ్మ

## నారాయణ వైద్యకళాశాలకు దేహం దానం!



ఆస్తిలో పేదయినా మంచి మనసు జాస్తిగా వుండే కొందరు ఉన్నతులు తమ ఉదారతను, చాటుతూ సమాజం పట్ల విశాల దృక్పథాన్ని ప్రదర్శిస్తారు. అటువంటి ఉన్నతమైన మనస్సులు బండారు పూలమ్మ. ఆమె తన తల్లి బండారు మాణిక్యమ్మ పార్థివదేహాన్ని పినాకిని దేహ సమర్పకుల సంస్థ ద్వారా నారాయణ వైద్య కళాశాలకు వితరణ చేసింది. నెల్లూరు లక్ష్మీపురంలోని లక్ష్మీసాయి అవెన్యూలో ఇంటి పనులు చేస్తూ పూలమ్మ తన తల్లిని పోషిస్తుండేది. వృద్ధాప్యం కారణంగా 91వ ఏట బండారు మాణిక్యమ్మ మరణించింది. ఇంటి యజమాని ఆదిశేషయ్య ద్వారా ప్రతిభా లయన్స్‌క్లబ్ నెల్లూరు వ్యవస్థాపకులు నుంకు రామ్మోహన్‌కు విషయం తెలిసి తల్లి పార్థివ దేహ సమర్పణకు పూలమ్మను కోరగా ఆమె అంగీకరించి తన సహృదయతను చాటుకుంది. నారాయణ వైద్య కళాశాలకు ప్రతిభా లయన్స్‌క్లబ్ కార్యదర్శి వాకా శ్రీధర్ ద్వారా విషయం తెలిసింది. వారు పినాకిని దేహసమర్పకుల సంస్థ సహకారం కోరగా నిర్వాహకులు తిక్కవరపు సుకుమార్‌రెడ్డి నిర్ధిత పత్రాలతో వైద్యకళాశాలలో శరీర నిర్మాణశాస్త్ర విభాగం సహాయ ఆచార్యులు దేవిశంకర్‌కి మాణిక్యమ్మ పార్థివదేహాన్ని అప్పగించడంలో తోడ్పడ్డారు. ఒక మంచి పనికి ఇంత మంది సహకరించడం గొప్ప విషయమే. అదే సందర్భంలో తన తల్లి మృతి చెందిన బాధలో కూడా సమాజం పట్ల జాగృతిని ప్రదర్శిస్తూ బండారు పూలమ్మ తల్లి పార్థివదేహాన్ని వైద్య కళాశాలకు బహూకరించడం బహు ప్రశంసనీయం.

# సబ్‌ప్లాన్‌లో సియంకు చిత్తశుద్ధిలేదు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ బిల్లులో పలు లోపాలున్నాయని, వాటి సవరణకోసం ప్రయత్నం చేస్తే సియం పడనీయలేదన్నారు సిపిఐ ఎమ్మెల్సీ చంద్రశేఖరరావు. నెల్లూరు నగరంలోని సిపియం జిల్లా కార్యాలయానికి విచ్చేసిన ఆయన 17వతేదీన నగరమీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రపంచబ్యాంకు షరతులకు లోబడి నగదు బదలీ పథకం తీసుకొని వచ్చిందని, దీని ద్వారా లక్షలాది మంది కడుపునిండని పరిస్థితి దేశంలో ఏర్పడిందని ఆయన వివరించారు. ఆహార భద్రతపై నూతన సంస్కరణలు తీసుకొని వచ్చేందుకు జాతీయస్థాయిలో నాలుగు వామపక్షపార్టీలు ఒక అవగాహనకు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ సర్‌చార్జ్‌ల విషయంపై మాట్లాడుతూ విద్యుత్‌కోతతో పాటు, విద్యుత్ బిల్లులు ఒక పద్ధతిపాడూలేకుండా పెంచి సామాన్యుడికి కరెంట్‌షాక్ ఇస్తున్నారని ప్రభుత్వ చర్యలను దుయ్యబట్టారు.

సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామరాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి దామా అంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘంనేత ప్రభాకర్, యువజన సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

# బేగంపేట "ఫైర్‌పోర్టు"

(మొదటిపేజీ తరువాయి)

భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రభుత్వానికి చెందిన అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్‌తో పాటు ఆరు శిక్షణా విమానాలు కాలి బూడిదయ్యాయి. శంషాబాద్‌లో రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించాక బేగంపేట ఎయిర్ పోర్టు ప్రాధాన్యత తగ్గిపోయింది. విమానాశ్రయాన్ని ఏపి ఏవియేషన్ అకాడమీ వాళ్లు వాడుతున్నారు. ఇక్కడ శిక్షణ విమానాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ హెలికాప్టర్లు కూడా వుంటుంటాయి. ఏవియేషన్ అకాడమీలోని హ్యాంగర్లలో ఒక దాంట్లో మంటలురేగి ఈ ప్రమాదం సంభవించింది. దాదాపు 100కోట్ల దాకా ఆస్తినష్టం అంచనా వుంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే కేవలం ఆ కోణంలోనే ఈ సంఘటనను చూడలేం. తీవ్రవాదులకు విడిది ప్రాంతంగా వున్న హైద్రాబాద్‌లో విద్రోహచర్య దిశగా కూడా దీనిని ఆలోచించాల్సి వుంటుంది. ఇది ప్రమాదమైనా, విద్రోహమైనా ప్రభుత్వ నిర్లక్ష్యం, ఏవియేషన్ అకాడమీ నిర్లిప్తత మెండుగా కనిపిస్తున్నాయి. బేగంపేట ఎయిర్‌పోర్టు ఒక బందెల దొడ్డి లాంటిదని దీనిలోకి ఎవరైనా వచ్చి వెళ్లొచ్చని దివంగతనేత వై.యస్. మరణం తోనే బుజువయ్యింది. ఆయన మృతిపై నెలకొన్న అనుమానాలు ఈరోజుకూ అలాగే వున్నాయి. సెప్టెంబర్ 2, 2009 నాడు బేగంపేట ఎయిర్‌పోర్టు నుండే ఆయన చిత్తూరు బయలుదేరడం, మధ్యలో నల్లమల అడవులలో పావురాలగుట్ట వద్ద ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రమాదానికి గురై మరణించడం తెలిసిందే! ఆనాటి ప్రమాదంలోనూ ఏవియేషన్ అకాడమీ వాళ్ల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ అని తెలిసి కూడా 'బెల్' హెలికాప్టర్‌ను తనిఖీలు చేయలేదు. ఎయిర్‌పోర్టుకు చుట్టూ రక్షణ కంచె లేదు. విద్రోహులు ఎవరైనా వచ్చి హెలికాప్టర్‌లో సాంకేతిక మార్పులు చేయడానికి అవకాశం కూడా వుంది. వై.యస్. మృతి చెందినప్పుడు ఈ తరహా అనుమానాలు ఎన్నోవచ్చాయి. వాటికి ఇంతవరకు సమాధానమే లేదు.

నిన్నటి సంఘటన వెనుక విద్రోహం వుందా? నిర్లక్ష్యమే వుందా అనేది తేలాలి. చిన్నచిన్న పాఠశాలలకు సైతం అగ్నిమాపక శాఖ నుండి ఎన్.ఓ.సిలు తప్పనిసరి చేస్తున్నారు. మరి బేగంపేట ఎయిర్‌పోర్టులో ఏపి ఏవియేషన్ అకాడమీ వారు ఏర్పాటు చేసిన హ్యాంగర్ల (విమానాలు, హెలికాప్టర్లు వుంచే చోటు)కు ఎన్‌ఓసిలేదంటే దానిని ఎవరి నిర్లక్ష్యమనుకోవాలి? ఎవరి తప్పనుకోవాలి? దీనికి మూల్యం ఎవరు చెల్లించాలి? నిర్లక్ష్యమా వర్ధిల్లు...!

# రగడ రగులుకుంది

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్న తెలంగాణ ఓటర్లు వైయస్సార్సీ అభ్యర్థి కొండా సురేఖకు అపజయం రుచి చూపించి తమ విషయంలో తాము గట్టిగానే వున్నామని నిరూపించుకున్నారు. ఓటర్ల తీర్పును టీఆర్‌యస్ విజయంగా దొర చిత్రీకరించాడు. ఆయన దొరతనం నిలవాలంటే సమస్య కొనసాగుతూనే వుండాలి. ఇప్పుడు ఆయనకు వైయస్సార్సీ సమస్యగా మారింది. ఆ పార్టీ వ్యూహాత్మకంగా తెలంగాణ జిల్లాల్లో చొచ్చుకుపోయింది. ఈ సమయంలో అఖిలపక్షం అంటూ మరోసారి కేంద్రం రాగమందుకుంది. ఈ నేపథ్యంలో వైయస్సార్ తనయ షర్మిల మరో ప్రజాప్రస్థానం దొర జిల్లాలను సునామీలా తాకింది. తట్టుకోలేక పోతున్నాడు. మాటలు జారాడు, అందుకు ధీటుగా షర్మిల సమాధానం ఇచ్చింది. సహజంగానే వైయస్సార్సీకి అంకితభావంతో పనిచేస్తున్న కొండా కుటుంబం కేసీఆర్ కుటుంబంపై విరుచుకుపడింది.

మాటల యుద్ధం, చేతల్లోకి దిగింది. దొరఏందిరో? అంటూ వైయస్సార్సీ తెలంగాణ యువకులు, కార్యకర్త[illegible] కత్తులు దూసారు. అందుకు ప్రతిగా కే[illegible]ండ్‌తో ప్రతిస్పందించింది. మొత్తంమీద కొండా సురేఖ వర్సెస్ కేసీఆర్ కాస్త టీఆర్‌యస్ వర్సెస్ వైయస్సార్సీగా మారింది. తెలంగాణ రాజకీయ చిత్రంలో ప్రజలు రెండుగా చీలారు టీఆర్‌యస్, వైయస్సార్సీ. ఇందులో సింహభాగం వైయస్సార్సీ వైపే మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో తన మనుగడను కాపాడు కునేందుకు ఫార్మ్‌హౌస్‌లోని విశ్రాంత తెలంగాణావీరుడు శిరస్త్రాణం ధరించి బరిలో తన కుటుంబంతో సహా దిగాడు. ఎంత మేకప్ చేసుకున్నా ముదిమి దాగదు కదా? కేసీఆర్ మాటలు నమ్మటం మానేసిన జనశాతం రోజురోజుకు పెరిగిపోతున్న తరుణంలో వైయస్సార్సీ పునాదులు తెలంగాణలో పటిష్ఠమౌతున్నాయనేది పరిశీలకుల భావన. ప్రజల్లో చాలా మంది 'మాకొద్దీ గులాబీ దొరతనం' అంటూ బహిరంగంగానే కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని అంటున్నారు.

ఈ లొల్లికి అంతం 2014లో జరిగే సాధారణ ఎన్నికలే.

# గుండెల్లో 'గుడి'

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గాలలో బీజేపీ విజయావకాశాలకు బాగానే గండి కొట్టాడు. ఆయన పార్టీ రెండు స్థానాలతో సరిపెట్టుకుంది. ప్రతిపక్ష కాంగ్రెస్‌కు ఇక్కడ అధికారంలోకి వస్తామన్న ఆశ ఎప్పుడూ లేదు. ఆ పార్టీ నాయకత్వం కూడా ఇక్కడ అంతంతమాత్రంగానే వుంది. ప్రజల్లో నరేంద్రమోడీ పట్ల వ్యతిరేకత వస్తే తప్పితే గుజరాత్‌లో తమకు అధికారం దక్కడం కల్లనే విషయం కాంగ్రెస్ అధిష్ఠానానికి అర్థమైపోయింది. అందుకే వాళ్లు గుజరాతీయులను కులాలు, మతాల వారీగా విభజించే ప్రయత్నం చేసారు. కేశుభాయ్ పటేల్ సొంత పార్టీ పెట్టడం వెనుక ప్రధానసూత్రధారి కాంగ్రెస్ అధిష్ఠానమే. 2002 గుజరాత్ అల్లర్లను బూచిగా చూపి మైనార్టీల ఓట్లను గుత్తసొత్తుగా కొల్లగొట్టాలని కాంగ్రెస్ ఆశపడింది. కాని ఆ ఆశలేవీ నెరవేరలేదు. నరేంద్ర మోడీ అభివృద్ధి మంత్రం ముందు కాంగ్రెస్ కుల, మత రాజకీయాలు పని చేయలేదు. గుజరాత్ ప్రజలు అభివృద్ధికే తిరిగి పట్టంకట్టారు. అయితే గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీకి ఒక సీటు తగ్గడం పెద్ద విషయమేమీ కాదు. గుజరాత్ ప్రజలు ఏకపక్షంగా మోడీవైపు నిలిచారు. కేశుభాయ్ పటేల్ ప్రభావం ఈ ఎన్నికలలో కొంత కనిపించింది. ఆయన పార్టీయే లేకుంటే 'మోడీ'కి మరిన్ని సీట్లతో పాటు ఓట్లు కూడా పెరిగి వుండేవి.

అదే సమయంలో హిమాచల్‌ప్రదేశ్‌ను మాత్రం అనుకున్నట్లే కాంగ్రెస్ చేజిక్కించుకుంది. 68స్థానాలుగల హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు 36సీట్లు రాగా అధికార బీజేపీ 26సీట్లకు మాత్రమే పరిమితమైంది. మొత్తానికి గుజరాత్‌లో మోడీ గెలవగా హిమాచల్‌లో మాత్రం బీజేపీ ఓడిపోయింది. కాంగ్రెస్‌కు గుజరాత్‌లో శృంగభంగం జరిగినా హిమాచల్ రూపంలో ఓదార్పు లభించింది.

# ప్రాణాంతకమవుతున్న ప్లాస్టిక్

(3వ పేజీ తరువాయి)

ఎక్కువైపోయింది! పర్యావరణానికే కాదు మనుషుల ప్రాణాలకు కూడా ఇవి చేటు తెస్తున్నాయి. అసలే మనం ఇప్పుడు తినే ఆహారం ఎరువులు, పురుగుమందులు చల్లి ఉత్పత్తి చేసివుంటుంది. గతంలో సేంద్రీయపద్ధతుల్లో పండించిన ధాన్యం, కూరగాయలు ఇప్పుడు లేవు. అంతా రసాయనాలమయమే. మన కొచ్చే రోగాలలో అధికభాగం రోగాలకు కారణం మనం తినే ఆహారమే. దీనికి ఇప్పుడు ప్లాస్టిక్‌ను తోడుచేస్తున్నాం. గతంలో అరటి ఆకులు లేదా విస్తరాకులతో టిఫిన్ పొట్లాలు కట్టేవాళ్లు. విందుభోజనాలలో అరటిఆకులు, విస్తర్లే కనిపించేవి. ఇవి ఆరోగ్యానికి మంచివి కూడా! కాని ఇప్పుడు నాగరికత ముసుగులో అవి మరుగునపడ్డాయి. వేడుకలలో భోజనాలకు సైతం లోహాలతో చేసిన ప్లేట్లను వాడుతూ క్యాన్సర్ వంటి రోగాలను చేజేతులా ఆహ్వానిస్తున్నాము.

# తెరపైకి జయ

(3వ పేజీ తరువాయి)

ఆ కుటుంబంలో కొన్ని మార్పులు తెచ్చింది. తమ మధ్య వచ్చిన స్వల్ప విభేదాలను పరిష్కరించుకుని, ఆనం జయకుమార్‌ను తిరిగి కలుపుకు పోవాలనుకుంటున్నారు. ఈ దిశగా ఆయనను డీసీసీబీ రేస్‌లోకి తేవొచ్చునని తెలుస్తుంది. కాంగ్రెస్ తరపున ఆయన పేరులేకుంటే ప్రత్యామ్నాయంగా బలహీనవర్గాలకు చెందిన రాచాల రవికుమార్ య[illegible]ను రంగంలోకి దించే అవకాశాలున్నాయి.

PDF Compressor Free Version






ఈ నెల 17వ తేదీన నెల్లూరులోని కలెక్టరేట్‌లో ప్రపంచ తెలుగుమహాసభల ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, పక్కన జాయింట్‌కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, అదనపు జాయింట్ కలెక్టర్ బి.రామిరెడ్డి

# అమరజీవికి వైయస్సార్సీ నివాళి



అమరజీవి పొట్టి శ్రీరాములు 60వ వర్ధంతి సందర్భంగా వైయస్సార్సీ నేతలు 15వతేదీ నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ కూడలి వద్దగల ఆయన విగ్రహానికి పూలమాలలువేసి ఘననివాళినర్పించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు సభ్యుడు మేకపాటి రాజమోహనరెడ్డితో పాటు మేకపాటి చంద్రశేఖరరెడ్డి కాకాణి గోవర్ధనరెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, ఆనం వెంకటరమణారెడ్డి, కె.శ్రీధరరెడ్డి, కె.వెంకటేశ్వరరెడ్డి, ఆర్.ప్రతాప్‌రెడ్డి, యస్ఆర్ వెంకటసుబ్బారెడ్డి, యం.ద్వారకానాథ్, పి.రూప్‌కుమార్‌యాదవ్, టి.వెంకటేశ్వరరావు, యస్.సునీల్‌రెడ్డి, డీసీ చెన్నారెడ్డి, పాండురంగారెడ్డి, బి.శ్రీకాంత్‌రెడ్డి, సూరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్యాగజీవి శ్రీరాములు

ఆంధ్రరాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం జిల్లా ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని అర్బన్ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు కోట గురుబ్రహ్మం పేర్కొన్నారు. అమరజీవి 60వ వర్ధంతిని పురస్కరించుకుని కోట ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నెల్లూరు అర్బన్ వైశ్య ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు శేగు షణ్ముఖరావు, తులసీ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరం శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర తదితర జిల్లా నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీ పాండురంగ అన్నదాన సమాజంలో జరిగిన కార్యక్రమంలో నగర శాసనసభ్యుడు పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు అందజేశారు.

# సామూహిక అండాళ్ గోష్ఠిగానం

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఈనెల 29సాయంత్రం ఆధ్యాత్మిక గురువు గుండాల గురవయ్య ఆధ్వర్యంలో దాదాపు వెయ్యిమందితో సామూహిక అండాళ్‌గోష్ఠిగానం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సీతారామ భజనమండలి, గోదాదేవి భజనమండలి, మహాలక్ష్మి భజనమండలి, పేరంటాలమ్మ భజనమండలి, యశోదకృష్ణ భజనమండలి, హరిహరనాథ భజనమండలి, లక్ష్మీనారాయణ భజనమండలి, గోవింద భజనమండలి, తాతయ్యస్వామి భజనమండలి, బృందావని భజనమండలి, వాసవి భజనమండలి, శ్రీపతి పండితారాధ్యుల భజనమండలి లకు చెందిన మహిళలు 30పాశురాలను 30 సంకీర్తనలుగా గానం చేస్తారు. తదుపరి క్రిష్ణారెడ్డిపల్లెకు చెందిన అవధూత తాతయ్యస్వామి "దివ్యప్రవచనము" ప్రవచిస్తారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# సర్వీస్ నుంచి తొలగించిన న్యాయం

డిసెంబర్16వతేదీ ప్రభుత్వ ఉత్తర్వు 132 ప్రకారం నెల్లూరు నగర ఎక్సైజ్ స్పెషల్‌కోర్టు మెజిస్ట్రేట్ జి.కాంతిమతిని సర్వీసు నుండి తొలగించారు. ఆమె గతంలో కూడా కొంతకాలం సస్పెండ్‌కు గురైవున్నారు. వైయస్సార్‌జిల్లా పులివెందులలో మేజిస్ట్రేట్‌గా విధులు నిర్వహిస్తున్నపుడు ఈవిడ ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. ఆ కారు ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లో ఆమె లబ్ది పొందిందని ముందు సస్పెండ్ చేసి అనంతరం కొంత కాలానికి తిరిగి పోస్టింగ్ ఇచ్చారు. అయితే ఆకేసు తాలూకు అవకతవకలు నిజమని విచారణలో తేలటంతో ఆమెను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

# నెల్లూరు కబుర్లు

# జనవరిలో పక్షుల పండుగ

-- రానున్న రోశయ్య, చిరంజీవి --



ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహించే పక్షుల పండుగను జనవరి 7, 8, 9తేదీలలో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. పక్షుల పండుగ స్పెషలిస్టు పి.రవిప్రకాశ్‌కే ఈ సంవత్సరం కూడా ఈ పండుగ బాధ్యతలను అప్పగించారు. ఆర్థికవ్యవహారాలన్నీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి చూస్తున్నారు. సూళ్లూరుపేట జడ్పీ హైస్కూల్ కేంద్రంగా మూడు రోజుల పాటు ఈ పండుగ జరుపుతారు. నేలపట్టు పక్షుల రక్షితకేంద్రం, పులికాట్ సరస్సుల సందర్శనకు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో ఈ ఫ్లెమింగో ఫెస్టివల్‌లో పాల్గొంటారు. పక్షుల పండుగ ప్రారంభంరోజున తమిళనాడు గవర్నర్ రోశయ్య, కేంద్ర మంత్రి చిరంజీవి వచ్చే అవకాశాలున్నాయి. వీరితోపాటు మన రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా పాల్గొంటారు. యువరత్న బాలకృష్ణను కూడా ఒకరోజు తీసుకొచ్చేందుకు వాకాటి నారాయణరెడ్డి ప్రయత్నిస్తున్నారు. అలాగే ముగింపురోజున మరికొందరు సినీతారలను తీసుకొచ్చి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గతేడాది పక్షులపండుగలో ముగింపురోజు పలువురు సినీతారలను తీసుకొచ్చారు. అయితే అక్కడ పర్యాటకులకంటే అల్లరిమూకల గోల అతి కావడంతో తారలు స్టేజీ ఎక్కకుండానే వెళ్లిపోయారు. అలాంటి అతిచేష్టలు పునరావృతం కాకుండా చూసుకోవాలి. గతానుభవాలను దృష్టిలో వుంచుకుని ముందుజాగ్రత్తలు తీసుకుంటే, అన్నీ సవ్యంగా జరిగిపోతాయి.

## జాతీయస్థాయిలో పక్షులపండుగ - ఎమ్మెల్సీ వాకాటి

సూళ్లూరుపేటలో 2013 జనవరి 7,8,9తేదీలలో జరుగనున్న పక్షులపండుగకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొని వచ్చేందుకు తగిన విధంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని శాసనమండలి సభ్యుడు వాకాటి నారాయణరెడ్డి అధికారులకు ఆదేశాలిచ్చారు. మంగళవారం సూళ్లూరుపేటలోని శేషసాయి కల్యాణమండపంలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాలకు చెందిన అన్ని ప్రభుత్వశాఖల అధికారులతో, ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్షాసమావేశం నిర్వహించారు.

# నెల్లూరులో భవాని దీక్షారథం

విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం నుంచి బయలుదేరిన భవాని దీక్షాప్రచారరథం 15వతేదీన నెల్లూరు నగరం శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానంకు చేరుకుంది. ప్రచారరథంకు నగర పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. ప్రచారరథ పర్యవేక్షకులుగా ఆలయ ఏఈఓ ప్రసాద్‌రావు, అర్చకులు మారుతీ యజ్ఞనారాయణ, పవన్‌కుమార్, ఆంజనేయులు, నరసింహమూర్తిలు వ్యవహరించారు.

# పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్

---- నగర కమీషనర్ టియస్ఆర్ ఆంజనేయులు ----



సమావేశంలో ప్రసంగిస్తున్న కమీషనర్ టి.యస్.ఆర్.ఆంజనేయులు

నెల్లూరు నగర మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పన్ను వసూలును రోజువారీగా 135.83లక్షలు టార్గెట్‌గా విధిస్తూ నగర కమీషనర్ టి.యస్.ఆర్.ఆంజనేయులు ఆదేశాలు జారీచేశారు. 15వతేదీ కార్పొరేషన్ సమావేశ భవనంలో ఆయన వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రెవెన్యూ స్పెషల్ డ్రైవ్‌పై దృష్టి కేంద్రీకరించారు. ప్రస్తుతమున్న 33మంది బిల్లు కలెక్టర్లకు అదనంగా కొంత మంది సహాయకులను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ఒక బిల్ కలెక్టర్‌కు ఒక వర్క్ ఇన్‌స్పెక్టర్, ఒక టాప్ డిస్‌కనెక్షన్ ఉద్యోగి, ఒక పిహెచ్ మేస్త్రీ సహాయకులుగా ఉంటారని, పన్నుల వసూళ్లపై విస్తృతంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. షాపింగ్ కాంప్లెక్స్‌ల నుండి 65లక్షల పన్ను బకాయిలు వుండగా ఎందుకు వసూలు చేయలేదని ప్రశ్నించారు. వెంటనే ఆ మొత్తాన్ని వసూలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో కార్పొరేషన్ డిప్యూటీ కమీషనర్ కె.భాగ్యలక్ష్మి, యంఈ సంపత్‌కుమార్, ఎంహెచ్ఓ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

# కళాంజలి పాటలపోటీలు

కళాంజలి సాంస్కృతిక సంస్థ 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23వ తేదీ ఆదివారం నెల్లూరు ట్రంకురోడ్డులోని టీవీఎస్ కళ్యాణసదన్ నందు అన్నమయ్య కీర్తనలు, సినిమా పాటలు, లలిత సంగీతం పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కళాంజలి అనంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10గంటల నుండి పోటీలు ప్రారంభమవుతాయి. ప్రతి విభాగంలో సీనియర్స్, జూనియర్స్‌కు విడివిడిగా పోటీలుంటాయి. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుంటాయి. 12ఏళ్ల లోపువారిని జూనియర్స్‌గా, ఆపైబడిన వారిని సీనియర్స్‌గా పరిగణిస్తాం. విజేతలకు 29వ తేదీ టౌన్‌హాల్‌లో జరిగే కళాంజలి 24వ వార్షికోత్సవసభలో బహుమతులిస్తామని, వివరాలకు తనను 98489 59575 నెంబర్‌లో సంప్రదించాలని అనంత్ కోరుతున్నారు.

# రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం

కొత్తగా నెల్లూరుజిల్లా రిటైర్డ్ గెజిటెడ్ పోలీసు అధికారుల సంఘాన్ని ఏర్పాటు చేసారు. రిటైర్డ్ ఏఎస్పీ కె.వీరారెడ్డిని ఈ సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అలాగే రిటైర్డ్ డిఎస్పీలు పి.శ్రీహరిరావును కార్యనిర్వాహకకార్యదర్శిగా, పి.మోహన్‌రావును కోశాధికారిగా ఎన్నుకున్నారు. జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్, ఏఎస్పీలు చంద్రశేఖర్, నాగేశ్వరరావులు ఈ సంఘానికి గుర్తింపునిచ్చారు.

# హెడ్‌కానిస్టేబుళ్లకు పోస్టింగ్స్

నెల్లూరుజిల్లాకు చెందిన 26మంది కానిస్టేబుళ్లు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొంది శిక్షణ పూర్తిచేసుకున్నారు. వీరికి 17వతేదీ నెల్లూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర సమావేశ భవనంలో ఎస్పీ బివి రమణకుమార్ కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం వారు కోరుకున్న ప్రాంతాలలో పోస్టింగ్‌లు ఇచ్చారు. జిల్లా ఎస్పీ తీసుకున్న నిర్ణయాన్ని జిల్లా పోలీసు సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈమేరకు సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీహరి, అధ్యక్షుడు మాధవరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు శివప్రకాష్, కోశాధికారి ప్రసాద్‌రావులు ఎస్పీని అభినందించారు.

# ఆర్టీసీకి స్పెషల్ పోలీస్

నెల్లూరు నగరంలో పోలీసుశాఖలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తుండిన కైలాస్‌నాథ్‌ను పోలీసుశాఖ తరపున నెల్లూరు ఆర్టీసీకి ప్రత్యేక అధికారిగా నియమిస్తూ జిల్లా ఎస్పీ బివి రమణకుమార్ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో ఆర్టీసీ ఆదాయానికి గండికొట్టూ ఆటోలు, జీపులు, టాటామేజిక్‌లలో ప్రయాణీకులను తరలించటం జరుగుతుంది, ఈ ప్రక్రియను నిరోధించేందుకు కైలాస్‌నాథ్‌ను నియమించారు.

PDF Compressor Free Version



సింహపురి సమాచారం

# వైకుంఠానికి ఏర్పాట్లు



ముక్కోటి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆర్డీఓ మాధవీలత

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 24న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా సంబంధితశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని నెల్లూరు నగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి ఆదేశించారు.

15వ తేదీ శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీమతి మాధవీలత మరియు నెల్లూరు నగర శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా శాసన సభ్యుడు మాట్లాడుతూ ఈనెల 24న జరిగే వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారి ఆశీస్సులకోసం స్వామి వారిని దర్శించుకొనేందుకు పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేస్తున్నందున, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అవసరమైన మౌలిక వసతులు చేపట్టాలని ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారికి సూచించారు. రెవెన్యూ డివిజన్ అధికారి మాధవీలత ఏర్పాట్లపై శాఖలవారీగా సమీక్షించారు. కృష్ణపట్నం పోర్ట్ సెక్యూరిటీ సిబ్బంది సేవలను కూడా వినియోగించుకోవాలని ఆమె పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో నెల్లూరు నగరకార్పొరేషన్ కమీషనర్ టి.ఎస్.ఆర్.ఆంజనేయులు, అడిషనల్ డి.యం.హెచ్.ఓ. డాక్టర్ పద్మావతి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సుబ్బరాజు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, తహసీల్దార్ భక్తవత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 18వ తేదీన నెల్లూరులోని తన నివాసగృహంలో జిల్లాలోని సాగునీటి కాలువల పనులపై జిల్లా అధికారులతో చర్చిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు

# రసాయనాల విషంతో వినాశనం

## ఐలాండ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త నాసిర్ హెచ్.జాలియా




సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్త హెచ్.జాలియా, వియస్‌యు వైస్‌ఛాన్సలర్ రాజారామిరెడ్డి తదితరులు

ఉత్పత్తులు పెంచేందుకు రసాయనాలు వినియోగించటం తప్పనిసరి చేయటం ద్వారా మానవజాతి వినాశనానికి మానవుడే కారణమౌతున్నాడని, అమెరికాలోని ఐలాండ్ యూనివర్సిటీ సైంటిస్ట్ డా॥నాసిర్ హెచ్.జాలియా ఆవేదన వ్యక్తం చేశారు. విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని అతిథిగ్రాండ్ హోటల్‌లో "పర్యావరణంలోని హానికారక పదార్థాలు, ప్రయోగాత్మక ఔషధాలు" అనే అంశంపై రెండురోజుల పాటు జరిగిన అంతర్జాతీయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆహార ఆహారేతర ఉత్పత్తులను భారీస్థాయిలో పెంచుకొనేందుకు అన్నీ తెలిసీ హానికర రసాయనాలు ఉపయోగించటం బాధాకరమన్నారు. వీటి వినియోగం వల్ల పర్యావరణం కలుషితమైపోతుందని, జీవసమతుల్యత దారుణంగా దెబ్బతింటుందని డా॥జాలియా ఆందోళన వ్యక్తంచేశారు. భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు రసాయనరహిత ఉత్పత్తులు తయారు చేసేందుకు ప్రపంచ మానవాళంతా దృష్టి కేంద్రీకరించాలని పిలుపునిచ్చారు.

భారతదేశంతో సహా అభివృద్ధి చెందిన దేశాలలో మానవ జీవన ప్రమాణం పెరిగినప్పటికీ దీర్ఘకాలవ్యాధుల బారిన కౌమారదశలోనే పడటం గమనిస్తే రసాయనాల ప్రభావం పర్యావరణంపై ఎంతగా ఉందో అందరికీ అర్థం అవుతుందని, ఇంతకంటే నిదర్శనమేమీ అవసరం లేదన్నారు. రెండురోజుల సదస్సులో అమెరికాలోని లోవా స్టేట్ యూనివర్శిటీ ఆచార్యుడు అనుమంత కందస్వామి, సౌత్ ఆఫ్రికాలోని దర్బన్ సైంటిస్ట్ జామిలా ఆడం, ఇంకా పనామా తదితర దేశాల నుండి శాస్త్రవేత్తలు సదస్సులో పాల్గొని పర్యావరణ కాలుష్యం వల్ల మానవాళి ఎదుర్కొంటున్న రసాయనాల వినియోగం వల్ల ఎదుర్కోనున్న, విషయాలపై విస్తృత చర్చలు జరిపారు. సదస్సు విజ్ఞానవంతంగా ముగిసేందుకు యూనివర్శిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది.

ఈ సందర్భంగా వియస్‌యూ ముద్రించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. వియస్‌యూ రిజిస్ట్రార్ నాగేంద్రప్రసాద్, విశ్వవిద్యాలయ ప్రాంగణ ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, రసాయనిక విభాగం అధ్యాపకుడు మరియు సదస్సు సంయుక్త కార్యదర్శి వేణుగోపాలరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి డా॥వై.సునందమ్మ, వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు హాజరయ్యారు.

# సహకారం కోసం సైనికులవ్వండి

• జిల్లా 'దేశం' నేతల పిలుపు



భూమిని సాగుచేస్తున్న ప్రతి రైతును ఓటరుగా చేర్చేందుకు అవసరమైతే అధికారులతో పోట్లాడేందుకైనా సిద్ధమన్నారు తెలుగు దేశం నాయకులు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్రలు. నెల్లూరు దేశం కార్యాలయంలో 15వ తేదీ జరిగిన ఆత్మకూరు, కోవూరు, నెల్లూరుగ్రామీణం, సర్వేపల్లి నియోజకవర్గాల పార్టీ అధ్యక్షకార్యదర్శులు, ముఖ్య కార్యకర్తలతో వారు విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు.

ఏడు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం స్థానికసంస్థల ఎన్నికలు జరపకుండా వాటిని అధోగతిపాలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి, విత్తమంత్రి రామనారాయణరెడ్డిలకు సహకార ఎన్నికలు జరగటం ఇష్టంలేదని, తమవారినే నాయకులుగా ఏర్పాటు చేసేందుకు కుట్రలు, కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. సహకార సంఘాల ఎన్నికల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అలాగే సహకార రణంలో తెలుగుదేశంపార్టీ విజయానికి ప్రతి కార్యకర్తా ఒక సుశిక్షితుడైన సైనికుడిగా పోరాడాలన్నారు. అందరికీ ఆమోదమైన వ్యక్తుల విజయానికి దేశం కార్యకర్తలందరూ కృషిచేయాలని వారు పిలుపునిచ్చారు.

అనంతరం నియోజకవర్గాల వారీగా సొసైటీలకు పోటీచేసే అభ్యర్థుల ఎంపిక విషయంలో వారిరువురూ నాయకులతో చర్చలు నిర్వహించారు.

# సేవాకార్యక్రమంలో నెల్లూరు రోటరీ



చిల్లకూరు మండలం వరగలిలో వున్న జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఈనెల 14న నెల్లూరు రోటరీ క్లబ్ నేతృత్వంలో 430 పళ్లాలు, గ్లాసులు పంపిణీ చేశారు. రోటరీక్లబ్ సభ్యులైన రొటేరియన్లు పిహెచ్‌ఎఫ్ కెడివి మోహన్, కొట్టే మధుసూదనరావు, తుంగా నారాయణరెడ్డిల వితరణతో రోటరీక్లబ్ అధ్యక్షు[illegible] కె.మధుసూదన్, డిప్యూటీ డీయిఓ వెంకటేశ్వర్లు, గూడూరు వ్యవసాయ మార్కెట్[illegible] కమిటీ మాజీ ఛైర్మెన్ యరటపల్లి జానకిరామిరెడ్డిలు వీటిని పంపిణీచేశారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు పి.శ్రీనివాసులురెడ్డి, ఎస్.రాఘవేంద్రశెట్టి, రోటరీకార్యదర్శి కె.వి.సుబ్రహ్మణ్యం, విజయరాఘవరెడ్డి, బాలిరెడ్డి, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, డా॥దొరస్వామినాయుడు, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

# జడ్.పి. వాకర్స్ సంఘానికి ప్రశంసాఅవార్డులు



కేవలం నడకకే పరిమితం కాకుండా సేవలందించడంలో తమ సత్తా చాటిన పొదలకూరురోడ్డుకు చెందిన ప్రజావాకర్స్ సంఘానికి వివిధ రంగాలలో ప్రతిభను కనపరచినందుకుగాను అవార్డులు లభించాయి.

డిసెంబర్ 8, 9తేదీలలో హైదరాబాదులోని ఆర్.టి.సి కళాభవన్‌లో జరిగిన అంతర్జాతీయ వాకర్స్‌క్లబ్ వార్షిక సమావేశాలలో ఈ అవార్డులను అందజేశారు. పొదలకూరురోడ్డుకు చెందిన ప్రజావాకర్స్ సంఘం వేదికగా ఆ సంఘ కార్యదర్శి మండువ శ్రీనివాసరావు చేస్తున్న సాంఘిక సంక్షేమ కార్యక్రమాలకు గుర్తుగా ఆయనకు ఉత్తమ కార్యదర్శి అవార్డు లభించగా ఈ సంఘంలోని మరో సభ్యుడు, రచయిత సి.ఆర్.రాఘవకి ఉత్తమ రచయిత అవార్డు వచ్చింది. అంతేకాకుండా ఉత్తమ వాకర్స్ సంఘంగా కూడా ఈ సంఘానికి పురస్కారం లభించింది. ఈ మూడు అవార్డులను అంతర్జాతీయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నాగభూషణం వీరికి అందించాడు.

పై సందర్భంగా డిసెంబర్ 12వ తేదీ పొదలకూరురోడ్డు జడ్‌పి హైస్కూల్‌లో అభినందనసభ ఏర్పాటుచేసి తమ సంఘానికి మంచి గుర్తింపు తీసుకొచ్చినందుకు మండువ శ్రీనివాసరావుని, సిఆర్.రాఘవని సంఘసభ్యులు ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు హరిబాబుయాదవ్, సంఘ జాయింట్ సెక్రటరీ ఆంజనేయులు, సంఘసభ్యులు బిరుదవోలు రామిరెడ్డి, ఓ.సుబ్బరాయుడు, పి.యస్.ప్రసాద్, శ్రీధర్, సత్యనారాయణ, విజయకుమార్, కళ్యాణి, వాసుదేవయ్య, బాలసుబ్రహ్మణ్యం, చెన్నయ్య, వెంకటేశ్వర్లు, రాజగోపాల్, వెంకయ్య, రఘురామిరెడ్డి, నారాయణరెడ్డి, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



## కదంబం

## స్నేహితుడి బదిలీ

సి.హెచ్.వి.బృందావనరావు
విజయవాడ, 99633 99189.

తెల్లారీ తెల్లారకముందే
మొబైల్ శబ్దతరంగాల పరిమళాన్నై
హలోహలోగా కమ్ముకునేవాడు
బయల్దేరడం ఒక్క క్షణం ఆలస్యమైతే చాలు
ఇంటిగేటు ముందు ప్రత్యక్షమై
స్కూటర్ హారన్‌ల కాలింగుబెల్లయ్యేవాడు
ఆఫీసుదాకా సాగే సహవాహన ప్రయాణ కవి సమ్మేళనంలో
అధికారి చాదస్తాల పర్వాల కవితాగానమయ్యేవాడు
ఎక్కలేక ఇక్కట్లు పడే స్టేటుమెంట్ల నిచ్చెనమెట్లను
స్నేహహస్తపు చేయూతతో ఎగసినదోసి ఎక్కించేవాడు
ఇంటి చికాకుల కరెంటుకోతల ఉక్కపోతల మధ్య
సాంత్వన వచనాల తాటాకువీవనల
సమీర తరంగమయ్యేవాడు
కలల్లో కన్పించే ఇలియనా, నయనతారల
గంగాయమునల సంగమం అడుగున
తన పిల్లల తల్లిమీది ఆపేక్షల పురాణ ప్రవంతిని
అంతర్వాహినిగా అంతరంగంలో దాచివుంచుకునేవాడు
ఆఫీసులో ఇవ్వాళ వాడి కుర్చీ ఖాళీగా కనిపించినా
అదృశ్య మౌన చిత్తరువులా
ఆవిరి యవనికల వెనుక అగుపిస్తూనే ఉన్నాడు
నిశ్శబ్దం మధ్యలోంచి గుసగుసలను కుమ్మరిస్తూ
చప్పుడుకాని నవ్వులను వెదజల్లుతూనే ఉన్నాడు
మరో మనస్వి అతని స్థానంలోకి వచ్చిందాకా
ఆ కుర్చీ అలాగే వుంటుంది వూగుతూనే, వాగుతూనే.

## తెలుగు ప్రచార రథం

తిరుపతిలో జరుగనున్న నాల్గవ ప్రపంచ మహాసభల సందర్భంగా నెల్లూరుజిల్లాలోని గ్రామగ్రామాలలో తెలుగుభాష గొప్పదనాన్ని చాటేందుకు 17వతేదీ జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుమాట, భావం, కథలు, కవిత్వం, పురాణాలు, వాటిలోని ఔచిత్యాన్ని ప్రజలకు వివరించేందుకు ప్రచార రథం గ్రామగ్రామాన తిరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిఆర్వో బి.రామిరెడ్డి, ఏఓ మధుసూదనశర్మ డియస్ఓ ఉమామహేశ్వరరావు, డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.

## అమరజీవికి ఆర్యవైశ్యుల ఘననివాళి



అమరజీవి శ్రీ పొట్టిశ్రీరాములు 60వవర్ధంతి సందర్భంగా నెల్లూరు ఆత్మకూరు బస్టాండు వద్ద వున్న విగ్రహానికి ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి కె.వి.చలమయ్య కో-ఆర్డినేటర్ తిరివీధి ప్రకాశరావులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు మరణించి 60సంవత్సరాలు అయినా ఆయన కాంస్యవిగ్రహాన్ని పార్లమెంటులో ఆవరణలో ప్రతిష్ఠించి భారతరత్న ఇవ్వాలని పలుసార్లు ప్రభుత్వాన్ని కోరినా ఆచరణకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు చీదెళ్ళ వెంకటేశ్వర్లు, వాసవీ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు మంచికంటి శ్రీనివాసులు, గుత్తి వాస్తువ్యులు ఇల్లూరు శంకరయ్య అచ్యుత సుబ్రహ్మణ్యం, దాసా లక్ష్మీనారాయణ, మున్నలూరు మల్లికార్జునరావు, జెవికెబాబు, బి.వి.నరసింహంలు పాల్గొన్నారు.

## గల్పిక

శ్రీను

# వివేకా ఇంట్లో విష్ణుమూర్తి లైవ్‌షో

అది వైకుంఠం... శేషపాన్పుపై డన్‌లప్ దిండు మీద తలవాల్చి మహాలక్ష్మి వారి ఒడిలో పాదాలు పెట్టి శ్రీ మహావిష్ణువు ఎదురుగా వున్న టీవీలో న్యూస్‌ఛానెల్ చూస్తున్నాడు. టీవీ 10.5లో భాగ్యనగరంలోని ఎల్‌బి స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ మేధోమథన సదస్సుకు సంబంధించిన వార్తలొస్తున్నాయి. సభలో గులాంనబీ ఆజాద్, సీఎం కిరణ్, పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ, కేంద్రమంత్రి చిరంజీవి, ఎంపీ వి. హెచ్.హనుమంతురావు వంటివాళ్లు మాట్లాడుతూ... మనమంతా ఐక్యంగా వుంటే మూడో సారి కూడా మనదే గెలుపని పిలుపునిచ్చారు. అప్పుడే ఎంపీ పొన్నం ప్రభాకర్ లేచి మరి తెలంగాణ సంగతేంటని అడిగాడు. లగడపాటి వుండి... ముందు మూడోసారి గెలవనీ... ఆ తర్వాత తెలంగాణ సంగతి చూద్దామన్నాడు. ముందు తెలంగాణ సంగతి తేల్చండీ... ఆ తర్వాత గెలుద్దాం అని పొన్నం అన్నాడు. దాంతో ఇద్దరికీ వాదోపవాదాలు పెరిగాయి. వారివెనుక తెలంగాణవాదులు, సమైక్యాంధ్రవాదులు చేరారు. చొక్కాలు పట్టుకుని తన్నుకోసారు. విష్ణుమూర్తి ఆ యాక్షన్‌థ్రిల్లర్ సన్నివేశాలను అమితాసక్తితో చూస్తుండగా... వెనుకనుండి 'బ్రేవ్' అనే సౌండ్ వచ్చింది. వెనుకకు చూస్తే... నారద మహర్షి, విష్ణువు ఆశ్చర్యంగా... మీరెప్పుడొచ్చారు స్వామీ, అయినా 108అంబులెన్స్ సైరన్ లేకుండా, మీరు 'నారాయణ నారాయణ' అనే సౌండ్ లేకుండా రారుగా అని అన్నాడు. దానికి నారదమహర్షి... నేను వచ్చేసరికి టీవీలో మంచి సన్నివేశాలు వస్తున్నాయి. అసలే బ్రేక్‌ఫాస్ట్ చేయకుండా వచ్చాను, మంచి ఆకలిమీదవుంటిని... ఆ సన్నివేశాలను చూస్తూ కడుపునింపుకున్నాను అని చెప్పాడు. ఏంటి నారదా విశేషాలని విష్ణుమూర్తి అడిగాడు. విష్ణుమూర్తి పాదాలను మహాలక్ష్మి వత్తుతుండడాన్ని నారదుడు అప్పుడు చూసాడు. ఏం ఖర్మ తల్లీ నీకు... ఎప్పుడూ అయనగారి పాదసేవేనా? ఇదే పని భూలోకంలో చేస్తే ఏమవుతుందో తెలుసా... భర్తల మీద గృహహింస కేసు పెట్టి బొక్కలో తోస్తారు. అయినా ఈ స్త్రీజాతికి చాకిరి నుండి విముక్తి లేదా? అని రెచ్చగొచ్చాడు. ఆ మాటలతో లక్ష్మీదేవికి కోపం వచ్చింది. సారా ఉద్యమంలో కొంగుబిగించిన నారీమణిలా విష్ణుమూర్తి పాదాలను విసురుగా తోసేసి ఇంట్లోకి వెళ్లిపోయింది. ఆ పరిణామానికి విష్ణుమూర్తి షాకై... ఎంత పని చేసావు నారదా, నీ ఆకలి తీర్చుకోవాలంటే ఏ నారింజతొక్కలో, నిమ్మకాయబద్దలో తినాలిగాని, మామధ్య అగ్గిపుల్ల గీస్తావా అని అడిగాడు. అప్పుడే నారదుడు తన సంచిలో నుండి 'జల్సిల్' సిరప్ తీసి తాగుతున్నాడు. విష్ణువు అది చూసి ఏంటిది అని అడిగాడు. ఇప్పుడు ఫుడ్డు ఎగస్ట్రా డోస్ పడింది కదా.. కడుపు రాయి మాదిరిగా అయింది. అందుకే అరుగుటకు ఔషధం తాగితినని చెప్పాడు. సరేగాని... ఏంటి భూలోక సమాచారం అని విష్ణువు అడిగాడు. ఏముంది స్వామీ... రేపేకదా వైకుంఠద్వార దర్శనం... ఆంధ్రప్రదేశ్‌లో దానికి సంబంధించి ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయో చూస్తారా అని నారదుడు అడిగాడు. అలాగే పోదాం.. లక్ష్మిని కూడా తీసుకెళదాం... అలాగన్నా అలకమానుతుంది అని చెప్పాడు. దాంతో ముగ్గురూ వైకుంఠం నుండి స్పెషల్ ఫ్లైట్‌లో నేరుగా విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో దిగారు. అక్కడ నుండి తిరుమల వైకుంఠద్వార దర్శనం టిక్కెట్లిచ్చే టీటీడీ ఆఫీసు వద్దకు చేరుకున్నారు. అక్కడ 'క్యూ' చూస్తే తిరుమలలో కంటే పొడవుగా వుంది. గేట్లు తెరవగానే భక్తులు టిక్కెట్లు కోసం తోసుకోసాగారు. అక్కడ పరిస్థితి అదుపుతప్పింది. దాంతో అక్కడేవున్న పోలీసులకు భలే సంబరమేసింది. వాళ్ల లాఠీలతో ఆడుకుని చాలారోజులైంది. చిక్కిందే సందనుకుని లాఠీలతో బాదేసారు. దాంతో భక్తులు ఎటు సందు దొరికితే అటు పారిపోయారు. అక్కడే నిలబడి ఈ ఘోరదృశ్యాలు చూస్తున్న విష్ణువు, శ్రీలక్ష్మి, నారదులు షాకయ్యారు. వైకుంఠ దర్శనం కోసం వచ్చిన వాళ్లకేంటి... ఈ పోలీసులు ఏకంగా నరకం చూపించేసారని అనుకున్నారు. అంతలో వెయ్యి నాలుగువేలు... వెయ్యి నాలుగు వేలు అనే కేకలు వినిపించాయి. ముగ్గురూ అటు చూసారు. తిరుమల వైకుంఠ ద్వార దర్శనం పాస్‌లను కొందరు సినిమా టిక్కెట్ల మాదిరిగా బ్లాక్‌లో అమ్ముతున్నారు. వారిలో ఒకతను వీరివద్దకు వచ్చి... ఏం బాబూ, వైకుంఠదర్శనానికి పోతారా అని అడిగాడు. మేం ఇప్పుడు అక్కడనుండే వస్తున్నాం నాయనా... అని నారదుడు అన్నాడు. ఆ మాట అతనికి అర్థంకాక తలగోక్కుంటుంటే, నారదుడే వుండి.. ఒక్కో పాస్ ఎంత నాయనా అని అడిగాడు. నాలుగువేలు అని అతను చెప్పాడు. మాకు మూడు పాస్‌లివ్వు అని నారదుడు తన సంచిలో చేయి పెట్టి 'ఓం నారాయణ' అనే మంత్రం చదివి ఓ నోటు బయటకు తీసాడు. అది '12000' రూపాయల నోటు. దానిని పాస్‌లు అమ్మే అతని చేతిలో పెట్టాడు. ఆ నోటును చూసేసరికి అతను కళ్లు తిరిగి క్రిందపడ్డాడు. అక్కడనుండి ముగ్గురూ రైల్వేస్టేషన్‌కు వెళ్లి తిరుమల ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. పక్కరోజు తెల్లారి 2గంటలకు ఐఆర్ 420-20 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరానికి చేరుకున్నారు. అక్కడనుండి ఆటో ఎక్కి నేరుగా తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంకు చేరుకున్నారు. అక్కడ ద్వారం ముందు రెండేసి కిలోమీటర్ల పొడవున రెండు క్యూలు వున్నాయి. దేవస్థానం లోపల చూస్తే ఇసుకేస్తే రాలనంతగా భక్త జనం. విష్ణుమూర్తి ఆ ప్రాంగణమంతా కలయజూసాడు. ఆయన మనసుకేదో వెలితిగా అనిపించింది. వెంటనే ఆయన గర్భగుడిలో హాయిగా నిద్రపోతున్న రంగనాథస్వామిలో దూరాడు. దూరిన వెంటనే వెనుకకు తిరిగాడు. దాంతో గోడవైపుకు ముఖంపోగా, వీపు భాగం భక్తులకు కనిపించేటట్లు వుంది. ఇక వైకుంఠద్వారదర్శనం ప్రారంభిస్తున్నామని ప్రకటించి వేదపండితులు గర్భగుడి తలుపులు తెరిచారు. అంతే... అక్కడ రంగనాథస్వామి పొజిషన్ చూసి పూజారులకు నోట మాట రాలేదు. కొద్దిసేపటికి వాళ్లు తేరుకుని... స్వామి అటువైపు తిరిగాడు... అటువైపు తిరిగాడు అని అరిచారు. భక్తులు తోసుకుంటూ వచ్చి... స్వామీ... కరుణించయ్యా... నీ దివ్య దర్శనం ఇవ్వవయ్యా అని పాటలు పాడసాగారు. భక్తుల బాధచూసి లక్ష్మీదేవి... స్వామి, ఎందుకు భక్తులపై అలిగారు. మీరు అటువైపు తిరగడానికి కారణమేమి అని అడిగింది. ప్రతి ఏటా వైకుంఠ ద్వారదర్శనం రోజు నా ప్రియభక్తుడు, స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(63) నన్ను ముందుగా దర్శించుకునేవాడు. అట్టి అమాయకపు భక్తుడు నాకు ఈ సంవత్సరం కనిపించలేదు. ఆ భక్తుడు వచ్చేవరకు నేను అటు తిరిగేది లేదని మొండికేసాడు. అప్పుడు నారదుడు... స్వామి మీకు అసలు విషయం తెలిసినట్లు లేదు. మీ భక్తుడు కాలినొప్పితో బాధపడుతూ భాగ్యనగరంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఏ మాత్రం అవకాశమున్నా ఆయన ఇలాంటి అవకాశాన్ని వదులుకుంటాడా? అని అన్నాడు. భక్తులు నా దగ్గరకు రాలేనప్పుడు నేనే వారి దగ్గరకు వెళ్లడం నా డ్యూటీలో భాగం అని రంగనాథస్వామి రూపాన్ని యథాస్థితికి చేర్చాడు విష్ణుమూర్తి.

★★★★★

అది హైద్రాబాద్‌లోని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసం. ఆనం వివేకా తన గదిలో పడుకున్నాడనే గాని ఆయన మనసంతా రంగనాథస్వామి గుడిమీదే వుంది. నిద్రకూడా రాలేదు. అంతలో నాయనా వివేకా... అనే పిలుపు వినిపించింది. వివేకా అటు చూసాడు. ఆశ్చర్యం... అక్కడ విష్ణుమూర్తి ప్రత్యక్షమయ్యాడు. వివేకా ఆశ్చర్యంతో... ఆనందంతో... స్వామీ... అంటూ ఆయన పాదాలపై పడి నమస్కరించాడు. తర్వాత లేచి... ఏంటి స్వామి... ఈ అల్పభక్తుడి కోసం మీరు నేరుగా వచ్చారు అని అడిగాడు. దానికి విష్ణుమూర్తి నా దర్శనం కోసం నువ్వు ప్రతి ఏటా వచ్చేవాడివి... ఈ సంవత్సరం రాలేకపోతున్నావని తెలిసి, నేనే నీ దగ్గరకు వచ్చాను అని చెప్పాడు. అది విని వివేకా... ఈ సంగతి తెలుసుంటే... ప్రతి సంవత్సరం ముక్కోటిరోజు ఇంట్లోనే పడుకుని వుండేవాడిని కదా స్వామీ... ఆ చలిలో వణుకుతూ ఎందుకుపోయేవాడిని అని అన్నాడు. ఆ మాటకు విష్ణువు నీ అసాధ్యం పాడుగాను అంటూ నోటి మీద వేలేసుకున్నాడు.

★★★★★

## సహకార ఎన్నికలు సజావుగా జరపండి

సహకార ఎన్నికలలో ఓటర్ల నమోదులో జరుగుతున్న అవకతవకలపై చర్య తీసుకోవాలని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు మేకపాటి రాజమోహనరెడ్డి 18వతేదీ జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్‌ను కలిపి కోరారు. ఆ మేరకు అయన విజ్ఞప్తి పత్రాన్ని అందజేశారు. సహకార ఎన్నికల్లో ఓటరు నమోదుపై అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు. వైయస్సార్సీ నేతలు సమాచారం అడిగితే అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని, అధికార పార్టీ వారు రహస్య ప్రదేశాలలో దొంగ ఓట్లునమోదు చేయిస్తున్నారని, ఇలాంటి విషయాలు జరగకుండా చూడాలని ఆయన జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఒక వేళ సహకార సంఘఎన్నికలలో తప్పుడు విధానాలు, అవకతవకలు చోటు చేసుకుంటే వైయస్సార్సీ సహకార ఎన్నికలను బహిష్కరిస్తుందని ప్రకటించారు. అయనతో పాటు ఉదయగిరి శాసనసభ్యుడు మేకపాటి చంద్రశేఖరరెడ్డి, కోవూరు శాసనసభ్యుడు యస్.ప్రసన్నకుమార్ రెడ్డి పార్టీ కేంద్ర పాలకమండలి సభ్యుడు వై.గోపాలరెడ్డి, జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధనరెడ్డి, మాజీ శాసన సభ్యులు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ శాసనమండలి సభ్యులు బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, నాయకులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధరరెడ్డి, ఆనం వెంకటరమణారెడ్డి, పాపకన్ను రాజశేఖరరెడ్డి, వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి, స్పందన ప్రసాద్, [illegible] తదితరులు పాల్గొన్నారు.

## వేజ్‌బోర్డ్ అమలుచేయాలి


జస్టిస్ జి.ఆర్.మజీథియా వేజ్‌బోర్డు సిఫార్సులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలనే డిమాండ్‌తో మంగళవారం నెల్లూరునగరంలో ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో జర్నలిస్టులు, మీడియా పర్సన్స్, ప్రదర్శన, రాస్తారోకో నిర్వహించారు. ఎపియుడబ్ల్యుజె జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి ట్రంకురోడ్డు గాంధీబొమ్మ కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు.

అనంతరం వారు కార్మికశాఖ ఉప సంక్షేమాధికారి రాచపాళెం రఘురాంకు వినతిపత్రం అందజేసారు.

PDF Compressor Free Version



## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

వృత్తి వ్యాపారాలలో ఆశించిన ఆదాయం ఉండదు. అయితే క్రొత్త వ్యాపారాలు ప్రారంభము, వ్యాపార పెట్టుబడులకు అవకాశాలు దొరకగలవు. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. పనులు అనుకున్న విధంగా జరగక ఆలస్యం కావడం వల్ల టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. శుభకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణా లుంటాయి. విద్యాప్రగతి బాగుంటుంది.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష 1, 2పాదాలు

వృత్తి వ్యాపారాలలో చికాకులను, సమస్యలను అధిగమిస్తారు. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. ఏ నిర్ణయాలు చేయాలనుకొనినను ఆందోళనగా ఉంటుంది. చివరిదాకా టెన్షన్‌పడుతుంటారు. వ్యాపార పెట్టుబడులకు, క్రొత్త వ్యాపారాలకు మంచి సమయం. దూర ప్రయాణాలుంటాయి. శుభకార్యాలలో పాల్గొంటారు. బిడ్డల యొక్క విద్యా ఉద్యోగావకాశాలు బాగుంటాయి.

## మిధునం



మృగశీర్ష 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థిక విషయాలలో అమిత జాగ్రత్త అవసరం. తొందరపడి హామీలివ్వడం, ఋణాలివ్వడం చేయవద్దు. షేర్లుపై స్వల్ప లాభాలుంటాయి. అనుకున్న పనులుగాని, ప్రభుత్వ అనుమతులుగాని సరిగా ఉండక ఆందోళన చెందుతాయి. బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. శుభకార్యప్రయత్నాలలో కాలయాపన జరుగుతుంది. దూరప్రయాణాలు ఖర్చులు, శుభకార్యాలలో పాల్గొంటారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యాపారవర్గాలకు ఈ వారం కొంత ప్రోత్సాహకరంగా, కొంత నిరాశగా ఉంటుంది. ఆదాయవ్యయాలు సరిపోతుంటాయి. కుటుంబంలో చిన్నచిన్న విషయాలపై విభేదాలు కలుగవచ్చును. అనుకున్న పనులు జరుపుకొనడానికై సమయానుకూలంగా ప్రవర్తించి సర్దుకొని పోతారు. శుభకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలు జరగడం ఉంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వాణిజ్య లావాదేవీలు, నూతన పెట్టుబడులకు అనుకూలకాలం, వ్యాపారవృద్ధి, వృత్తిపరంగా ప్రాధాన్యత, ఆదాయము పెరగడం ఉంటుంది. శుభకార్యాలలో సభలు సమావేశాలలో ప్రముఖంగా పాల్గొంటారు. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. అనుకోని అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. సోదరవర్గంతో ఆస్తి వ్యవహారాలలో జాగ్రత్తగా మెలగండి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆరోగ్యపరంగా, ఆహార విషయాలలో జాగ్రత్త వహించండి. కుటుంబసభ్యుల అభిప్రాయాలు మీకంటే భిన్నంగా ఉండవచ్చు. క్రయవిక్రయాలు సంతృప్తికరంగా ఉండి, వ్యాపారాలలో ఎక్కువ శ్రద్ధ చూపుతారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. పనులు అనుకున్నవి ప్రశాంతంగా జరుగుతాయి. దీర్ఘకాలిక పెట్టుబడులు, కాంట్రాక్టులు, లీజులు పొడిగించడంలో అనుకూలత ఉన్నది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 21.12.2012 నుండి
తేది. 27.12.2012 వరకు.

ఈవారం మీనమేషవృషభరాశులలో చంద్రుడు, వృషభంలో గురుకేతువులు, 23తేదీ నుండి మేషంలో కేతువు, తులలో శనిరాహువులు, వృశ్చికంలో శుక్రబుధులు, తేది 26నుండి ధనుస్సులో రవితో బుధుడు, మకరంలో కుజుడు సంచరిస్తారు.

**పంచాంగము :** తేది 23 ఆదివారము ముక్కోటి ఏకాదశి తేది 27 గురువారము దత్తాత్రేయ జయంతి.

**ముహూర్తములు:** తేది 23 ఆదివారము ఉదయం 10.10నుండి 11.48లోగా కుంభలగ్నమున వివాహ వ్యాపార, అక్షరాభ్యాసములు.

తేది 26 బుధవారము ఉదయం 10నుండి 11.45లోగా కుంభలగ్నమున వివాహ వ్యాపార అన్నప్రాశన ముహూర్తములు. రాత్రి 9.21 నుండి 11.31 లోగా సింహలగ్నమున వివాహ, గృహప్రవేశములు.

తేది 27 గురువారం ఉదయం 9.58 నుండి 11.45లోగా కుంభలగ్నమున వ్యాపార వివాహములు. రాత్రి 9.18నుండి 11.28లోగా సింహలగ్నమున వివాహ గృహప్రవేశములు.

### మార్గశీర్షమాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 21 | శుక్ర | నవమి | రా॥ గం.3.52వ॥ |
| తేది. 22 | శని | దశమి | రా॥ గం.4.52వ॥ |
| తేది. 23 | ఆది | ఏకాదశి | రా॥ గం.6.20వ॥ |
| తేది. 24 | సోమ | ద్వాదశి | పూర్తిగా |
| తేది. 25 | మంగళ | ద్వాదశి | ఉ॥ గం.8.20వ॥ |
| తేది. 26 | బుధ | త్రయోదశి | ఉ॥ గం.10.26వ॥ |
| తేది. 27 | గురు | చతుర్దశి | మ॥ గం.12.37వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి వ్యాపారాలలో ఆదాయము తృప్తికరమైన, ఏదో ఒక రూపంలో ఖర్చులు వెన్నాడుతుంటాయి. ఆర్థిక వ్యవహారాలలో కుటుంబసభ్యుల సహకారం తీసుకొనడం మంచిది. శుభకార్యాలలో పాల్గొని కార్యభారాన్ని కొంత వహిస్తారు. రావలసిన బాకీలు నిలబడిపోయి, ఋణాల వత్తిడి ఎక్కువగా ఉండవచ్చును. స్థిరాస్తుల వ్యవహారాలలో తొందరపడకండి.


## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు పొందుతారు. వృత్తిపరంగా ప్రతిభ ప్రదర్శించగలరు. షేర్లు పెట్టుబడి అవకాశాలు దొరకగలవు. శుభకార్యాలలో పాల్గొనడం, నిర్వహించడం జరుగుతుంది. వ్యాపారరంగంలో ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలలో తొందరపడవద్దు. ఉద్యోగులకు పనిభారం, అధికారిక ప్రయాణాలుంటాయి. ఉద్యోగప్రయత్నాలలో అవకాశాలు స్వల్పం.


## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

పరిశ్రమలు, వ్యాపారవర్గాలకు అభివృద్ధి అవకాశాలు దొరకగలవు. వ్యాపారపెట్టుబడులకు, సభలు సమావేశాలకు ఆహ్వానాలు అందుతాయి. కుటుంబంలో ఒకరి అనారోగ్య బాధ ఉంటుంది. భూములు స్థలాలు యొక్క క్రయవిక్రయాలు వాయిదాపడగలవు. కోర్టు వ్యవహారాలు స్వల్పంగా మనస్తాపాన్ని కలిగిస్తాయి. శుభకార్యాలలో పాల్గొనడం, తద్వారా ఖర్చులుంటాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థికస్థితి బాగుండి వృత్తి జీవనంలో గుర్తింపు గౌరవాలు, వ్యాపారమునందు ఆదాయం పెరగడం ఉంటుంది. పన్నులు చెల్లింపులు సకాలంలో చేస్తారు. పలుకుబడి, పరువు కొరకు ఖర్చులుంటాయి. ప్రభుత్వ కార్యాలయాలలో పనులు అనుమతులు ఆలస్యం కాగలవు. ఆవేశాలు కోపతాపాలు అదుపులో ఉంచుకొనండి. శుభకార్యాల తేదీలు నిర్ణయం కాగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

క్రొత్త వ్యాపారాలకు, పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. అనుకున్న పనులను ఏదో ఒక విధంగా నెరవేర్చుకొంటారు. వ్యాపార పారిశ్రామిక యజమానులకు ఆదాయం పెరుగుతుంది. అభివృద్ధి కొరకు, అవసరాలకు ఋణాలు చేస్తారు. దైవ కార్యాలలో, శుభకార్యాలలో ప్రముఖంగా పాల్గొంటారు. విద్యా ప్రగతి బాగుంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

సమయోచిత నిర్ణయాలవల్ల మీకు మేలు జరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో అందరి మన్ననపొందడం, సమర్థులుగా గుర్తింపు పొందడం జరుగుతుంది. పెండింగ్ పనులు యథాతథంగా ఉంటాయి. వ్యాపార రంగంలో పెట్టుబడి విస్తరణ అవకాశాలు బాగుండటం, ఆదాయం పెరగడం జరుగుతుంది. తల్లి వర్గం వారికి యథోచితంగా సహాయం చేస్తారు.

### ఓటరు నమోదుకెళ్తే

# అధికారులు డుమ్మాకొడుతున్నారు

**'దేశం' నేతల ఆరోపణ**

సహకార ఎన్నికలు పారదర్శకంగా ఉండేందుకై ప్రతి రాజకీయపార్టీకీ ఓటర్ల జాబితా ప్రతులను రుసుము చెల్లించి పొందే సౌకర్యం కలిగించాలని దేశం జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్‌ను కోరారు. బీద రవిచంద్ర ఆధ్వర్యంలో జిల్లా, నగర, మండల తెలుగుదేశం నాయకులు కలెక్టర్‌ను ఆయన బంగళాలో 17వ తేదీన కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజూ ఏ సహకార సంఘంలో ఎంతమంది ఓటర్లు చేరారో వివరాలను సంబంధిత కార్యాలయ గోడకు అంటించి అందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రైతులు సభ్యులుగా చేరేందుకు సహకార సంస్థల కార్యాలయాలకు వస్తున్నా, సొసైటీ నిర్వాహకులు, అధికారులు అందుబాటులో లేకుండా తప్పించుకొని తిరుగుతున్నారని వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సహకార వ్యవస్థ బలోపేతం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీద రవిచంద్రతో పాటు దేశం నాయకులు టి.రమేష్‌రెడ్డి, బెజవాడ ఓబులరెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అంచెల వాణి, జి.కన్నబాబు, పాముల రమణయ్య, సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దొంగచాటుగా ఓటర్లపేర్లు నమోదు


లాడ్జీలలో సీఈఓలను కూర్చోబెట్టి జిల్లా సహకారశాఖ అధికారి సహాయసహకారాలతో దొంగచాటుగా సొసైటీలలో ఓటర్లను చేర్పిస్తున్నారని వైయస్సార్సీ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధనరెడ్డి విమర్శించారు. ఇందుకూరుపేటలోని వైయస్సార్సీ కార్యాలయంలో కోవూరు శాసనసభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు మేలు చేసేందుకో, లేదా సహకారసంస్థలకు ఆర్థిక పరిపుష్టి కల్పించడానికో ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారరంగానికి సంబంధించి రూపొందించిన ప్రత్యేక చట్టం ప్రకారం, ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు నిర్వహిస్తున్నారే తప్ప మరేమీ కాదన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఉచిత విద్యుత్, రైతుల రుణాల మాఫీ వంటి పథకాలను చేపట్టిన మహనీయుడు వైయస్సార్ అన్నాడు. అలాగే కేవలం సహకార బ్యాంకుల వరకూ నాథన్ సిఫారసులను అమలుచేస్తూ 1400కోట్ల సహకార బ్యాంకులకిచ్చి రైతులకు రుణాలమాఫీ చేయించిన ఘనత కూడా దివంగతనేత రాజశేఖరరెడ్డిదేనని కాకాణి గుర్తుచేశారు.

సమావేశంలో ఇందుకూరుపేట మండల పార్టీ కన్వీనర్ యం.శ్రీనివాసులురెడ్డి, నేతలు వి.చలపతి, జి.విజయకుమార్, డి.శివకుమార్‌రెడ్డి, బి.వెంకటకృష్ణారెడ్డి కార్యకర్తలు, వైయస్సార్, జగన్ అభిమానులు పాల్గొన్నారు.

# అక్రిడేషన్లు ఇవ్వండి

ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు యూనియన్ ఈనెల 13న రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ చంద్రవదనన్‌ను కలిసి చిన్న పత్రికల జర్నలిస్టులకందరికీ అక్రిడేషన్లు జారీచేయవలసినదిగా విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా జర్నలిస్టులకు ఏ.పి.యస్.ఆర్.టి.సి ఏ.సిబస్సు ఛార్జీలో రాయితీనిచ్చినందుకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జాలె వాసుదేవనాయుడు, ప్రధానకార్యదర్శి డి.హరిప్రసాద్, ఉపాధ్యక్షులు పి.వి.యస్.యస్.యస్ ప్రసాద్, ట్రెజరర్ వి.రమేష్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం నియమించే కమిటీలన్నింటిలో తమ యూనియన్‌కు ప్రాతినిధ్యం కల్పించవలసినదిగా అల్పాదాయంతో నెట్టుకొస్తున్న పత్రికా విలేకరులకు ఇండ్లస్థలాలను ఇవ్వవలసినదిగా కోరారు.



## వధువు కావలెను — పెళ్లి సంబంధాలు — వరుడు కావలెను

1. 1982 మార్చి 29 జననం. ఎత్తు 5'8". చదువు యం.బి.బి.యస్(యస్.వి.యస్.మెడికల్ కాలేజ్), యం.డి(సైకియాట్రీ) ఫైనల్(నారాయణ మెడికల్ కాలేజ). ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్తివిలువ 2కోట్లు. స్వస్థలం మహబూబ్‌నగర్‌జిల్లా.
2. 1985 ఫిబ్రవరి 4 జననం. ఎత్తు 5'6". చదువు బి.యస్.సి. విజువల్ కమ్యూనికేషన్. ఉద్యోగం అమెజోన్(హైద్రాబాద్), జీతం నెలకు 50,000/-. ఆస్తివిలువ 6కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
3. 1984 ఆగష్టు 23 జననం. ఎత్తు 6". చదువు బి.టెక్(ఇ.సి.ఇ), యం.బి.ఏ. ఉద్యోగం విప్రో, బెంగుళూరు. జీతం నెలకు 85,000/-. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం చిత్తూరుజిల్లా. ఆస్తివిలువ 3కోట్లు.
4. 1985 జూన్ 6 జననం. ఎత్తు 5'6". చదువు బి.టెక్, యం.బి.ఏ. ఉద్యోగం ఐ.టి [illegible] టి.సి.యస్, హైదరాబాద్. జీతం నెలకు 70,000/-. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం, ఆస్తివిలువ 5కోట్లు. స్వస్థ[illegible]జిల్లా. ప్రస్తుతనివాసం హైదరాబాద్.
5. 1984 డిసెంబరు 30 జననం. ఎత్తు 5'7". చదువు బి.టెక్, యం.ఐ.యస్(అమెరికా). వ్యాపారం రియల్‌ఎస్టేట్ మరియుకన్‌స్ట్రక్షన్స్, ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివిలువ 20కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుతనివాసం బెంగుళూరు.
6. 1978 ఫిబ్రవరి 25 జననం. ఎత్తు 5'4". చదువు బి.టెక్, ఐ.ఐ.టి, మద్రాసు. పి.హెచ్.డి(బయోటెక్నాలజీ). ఉద్యోగం అమెరికా. స్వస్థలం చిత్తూరుజిల్లా. ఆస్తివిలువ 3కోట్లు. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం.
7. 1987 జూలై 2 జననం. ఎత్తు 5'7". చదువు యం.బి.బి.యస్(గాంధీ మెడికల్ హాస్పిటల్), హైదరాబాద్. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం మెదక్‌జిల్లా. ప్రస్తుతనివాసం హైదరాబాద్. ఆస్తివిలువ 5కోట్లు.
8. 1987 డిసెంబర్ 10 జననం. ఎత్తు 5'5". చదువు బి.టెక్(సివిల్ ఇంజనీరింగ్) హీవర్స్ బళ్ళారి, జీతం 40,000/-. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్తివిలువ 60లక్షలు. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుతనివాసం బెంగుళూరు.
9. 1983 మే 24 జననం. ఎత్తు 5'4". చదువు బి.టెక్(నారాయణ నెల్లూరు), యం.టెక్(కోయంబత్తూరు). ఉద్యోగం క్యాప్ జెమిని, బెంగుళూరు. జీతం నెలకు 75,000/-. ఆస్తివిలువ 30లక్షలు. ఉన్నతమైన మధ్యతరగతి రెడ్డి వ్యవసాయకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
10. 1991 జూన్ 17 జననం. ఎత్తు 5'6". చదువు బి.టెక్(కంప్యూటర్స్). ఉద్యోగం గేమ్స్ లాఫ్ట్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, హైదరాబాద్. జీతం నెలకు 10,000/-. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం, ఆస్తివిలువ 30లక్షలు. స్వస్థలం చిత్తూరుజిల్లా.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413, పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.

98480 34522
94406 39460.

పోస్ట్‌బాక్స్ నెం.4, C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ప్లాట్ నెం. 1 & [illegible] మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

PDF Compressor Free Version



## డబుల్ చైతన్య



అక్కినేని నాగేశ్వరరావుతో 'ఇద్దరు మిత్రులు', నాగార్జునతో 'హలోబ్రదర్' వంటి ద్విపాత్రాభినయ చిత్రాలు నిర్మించిన నిర్మాత శివప్రసాద్‌రెడ్డి త్వరలో నాగచైతన్యతోనూ అలాంటి ద్విపాత్రాభినయ సినిమా తీయనున్నాడు. అయితే ఈ విషయాన్ని శివప్రసాద్‌రెడ్డి ఇంకా బహిరంగంగా చెప్పలేదు. ఏఎన్ఆర్, నాగ్‌లతో ఆ సినిమాలు తీసి సక్సెస్ సాధించాడు కాబట్టి నాగచైతన్యతోనూ ఆ ప్రయోగం చేయవచ్చు.



## లారెన్స్‌కు ఫైన్



'రెబల్' సినిమాకు దర్శకుడిగా అంచనాలకుమించి ఖర్చుపెట్టించినందుకు లారెన్స్‌కు 2.5కోట్లను జరిమానాగా విధించింది నిర్మాతల మండలి. రెబల్ నిర్మాతలు జె.పుల్లారావు, భగవాన్‌లు ఆయన మీద కేసు వేసారు.

## మూ'వీ'క్షణం

## యశోసాగర్ ఇక లేడు



"ఉల్లాసంగా ఉత్సాహంగా" హీరో యశోసాగర్ బుధవారం తెల్లవారు ఝామున కర్ణాటకలోని తుముకూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఫ్లైట్ మిస్ కావడంతో రోడ్డు మార్గాన కారులో హైదరాబాద్ వస్తుండగా వంతెనను ఢీకొని ఈ ప్రమాదం సంభవించింది.



## వేదికపై వారసులు

### ఆడియో వేడుకలో గౌతమ్, అర్జున్!



దిల్‌రాజు ఏ పని చేసినా వైరైటీగానే వుంటుంది. చేసే ప్రతి పనినీ తన స్టైల్‌లో చేసి చూపించాలనుకుంటాడు ఈ యువనిర్మాత. ఇటీవల తన సంస్థ 10వ వార్షికోత్సవ కానుకగా నిర్మించిన మల్టీస్టారర్ చిత్రం "సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు" ఆడియో విడుదల కార్యక్రమాన్ని అదే తరహాలో వినూత్నంగా నిర్వహించాడు రాజు. తెలుగుదనం ప్రతి బింబించేలా ఇంటి సెట్‌ని బ్యాక్‌డ్రాప్‌గా రూపొందించి వేదిక నిర్మించాడు. కార్యక్రమం ఆసాంతం తెలుగుదనపు సంస్కృతి సంప్రదాయం వుట్టిపడేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సినిమాలోని ఇద్దరు హీరోలు వెంకటేష్, మహేష్‌బాబుల తనయులు గౌతమ్, అర్జున్‌లచేత ఆడియోని విడుదలచేయించారు. దాదాపు 25సంవత్సరాల తరువాత ఇద్దరు ప్రముఖహీరోలు కలిసి నటిస్తున్న సినిమా పాటల పండుగలో వారి కుమారులు పాల్గొనడం అభిమానులని ఆనందంతో ముంచెత్తింది.

ఈ ఆడియో వేడుకలో చిత్రదర్శకుడు శ్రీకాంత్ అడ్డాల పేర్కొన్నట్లుగా యాంకర్‌లుగా సుమ, ఝాన్సీ చేసిన గోలతప్ప ఈ పాటలసందడి చక్కని రాగాల సవ్వడిగా జరిగింది. వెంకటేష్ కుమారుడు గౌతమ్ సి.డి.ని ఆవిష్కరించి తొలికాపీని మహేష్‌బాబు తనయుడు అర్జున్‌కి అందజేశాడు. హీరోయిజం కోరుకోకుండా ఒక చక్కని కుటుంబ చిత్రంగా ఈ సినిమాని చూడాలని దర్శకనిర్మాతలు ఈ ఇద్దరుహీరోల అభిమానులకు విజ్ఞప్తి చేశారు. మిక్కీ జె.మేయర్ సంగీత దర్శకత్వంలో రూపొందిన "సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు" పాటలు ఇప్పటికే సంగీతప్రియులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జనవరి 11న విడుదల కానున్న ఈ సినిమాలో సమంత, అంజలి(జర్నీ ఫేం)లు హీరోయిన్లు.



## డివిజన్ గూడూరు వార్తలు

## రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న అశోక్‌కుమార్ యూత్

రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు అన్నారు. ప్రీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా గూడూరు అశోక్‌నగర్‌లో అమూల్య స్వచ్ఛందసేవా సంస్థ ఆధ్వర్యంలో అశోక్‌నగర్ యూత్ శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. సేవాసంస్థ అధ్యక్షుడు టోనీ మాట్లాడుతూ 82యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బట్టేపాటి నరేంద్రరెడ్డి, కిరణ్‌కుమార్, విజయకుమార్‌రెడ్డి, సిఐ ఉప్పాల సత్యనారాయణ, అశోక్‌నగర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు నియామక పత్రాలు



పత్రాలు అందజేస్తున్న సబ్‌కలెక్టర్ నివాస్

అంగన్‌వాడీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు సబ్ కలెక్టర్ నివాస్ 15వతేదీ నియామక పత్రాలు అందజేశారు. డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఖాళీలకు ఇటీవల ఇంటర్వ్యూలు నిర్వహించిన విషయం విదితమే ఈ మేరకు ఇంటర్వ్యూల్లో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు సబ్ కలెక్టర్ జె.నివాస్ నియామక పత్రాలను అందజేశారు.

## ఎస్‌బిఐ ఏటిఎం ప్రారంభం

గూడూరులోని వివేకానందరోడ్డు లోని స్టేట్‌బ్యాంకు సమీపంలో 15వ తేదీ నూతనంగా ఏటిఎంను ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ ప్రకాష్ ప్రారంభించారు. పట్టణంలో ఇప్పటికే 3 ఏటిఎంలు పనిచేస్తాయని స్థానిక ఖాతాదారుల సౌకర్యార్థం ఈ ఏటిఎంను ప్రారంభించినట్లు బ్రాంచ్ మేనేజర్ ప్రకాష్ తెలిపారు.

## టోల్‌ప్లాజాల వద్ద భద్రత పటిష్టం - డిఎస్పీ

జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజాల వద్ద ఎస్పీ రమణకుమార్ ఆదేశాలమేరకు భద్రతను పటిష్టం చేస్తున్నట్లు గూడూరు డిఎస్పీ సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని బూదనం టోల్‌ప్లాజా సమీపంలో ఉన్న స్వర్ణటోల్‌వే వద్ద 15వ తేదీ ఆయన వైర్‌లెస్ సెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై జరిగే చోరీలు, ప్రమాదాలను అరికట్టేందుకు టోల్‌ప్లాజాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు సిబ్బందిని నియమిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే ప్రస్తుతం వైర్‌లెస్ సెట్‌ను ఏర్పాటుచేయడంతో పాటు 12మంది సిబ్బంది విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట గూడూరు రూరల్ సిఐ వేమారెడ్డి, ఎస్సై దశరథరామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా రియాజ్‌అహ్మద్



రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా షేక్ రియాజ్ అహ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. తిరుపతిలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రం నలుమూలల నుండి తెలంగాణ, రాయలసీమ, కోస్తా, ఆంధ్ర డిప్లొమా ఇంజనీర్స్ వచ్చి ప్రాంతీయ తత్వానికి అతీతంగా ఆయన ప్యానల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా షేక్‌రియాజ్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా టి.భాస్కర్‌రెడ్డి(నల్గొండజిల్లా) ఫైనాన్స్ సెక్రెటరీగా ఎ.రాంబాబు(ఈస్ట్ గోదావరి జిల్లా) మరియు కమిటీ మెంబర్లను కూడా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ "లాయర్"తో మాట్లాడుతూ సేవ, స్నేహం వలననే ఈ ప్రాంతీయ బేధాలు లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగిందని ఇదే స్ఫూర్తితో డిప్లొమా ఇంజనీర్లను కలుపుకొని న్యాయమైన కోరికల సాధనకై కృషి చేస్తానని అన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర ఎన్‌జిఓ సంఘ అధ్యక్షులు మరియు ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికసంఘం ఛైర్మెన్ వి.గోపాలరెడ్డి, జనరల్ సెక్రటరీ అశోక్ బాబు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపినట్లు చెప్పారు.

## అమరజీవికి ఘననివాళి

పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని గూడూరులోని ఆస్పత్రిరోడ్డులో గల శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి మున్సిపల్ కమీషనర్ సుశీలమ్మ 16వ తేదీ పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ఆసువులు బాసిన అమరజీవి ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఆమె వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## మీడియాలో వచ్చే వార్తలు... నా వెంట్రుకతో సమానం!

### "నాయక్" పాటల విడుదల సభలో 'రామ్‌చరణ్'



ఓవైపు "కెమెరామెన్ గంగతో రాంబాబు" అంటూ తెరపైకొచ్చి మీడియాతో పెట్టుకుంటే అడ్రస్‌లేకుండా పోతావ్ అనే డైలాగ్‌ని ప్రకాష్‌రాజ్‌కి తన స్వరంతో ఆవేశంగా "పవన్‌కళ్యాణ్" చెప్పిన సినిమా ఇంకా కొన్ని థియేటర్లలో ఆడుతుండగానే, సినిమా వేరు వాస్తవం వేరు అన్నట్లుగా మీడియాలో వచ్చే వార్తలు నా వెంట్రుకతో సమానం అంటూ ప్రకటించేసాడు అదే పవర్‌స్టార్ అన్నకొడుకు రామ్‌చరణ్.

చరణ్ ఏ సభలో మాట్లాడినా ఓ వివాదానికి తెరతీస్తాడు. గతంలో బాలకృష్ణ గురించి ఓసారి, మహేష్‌బాబు గురించి ఓసారి నోరుపారేసుకుని పెద్ద దుమారాన్నే సృష్టించాడు. ఇప్పుడు కొత్తగా "నాయక్" ఆడియో విడుదల సందర్భంగా గతంలో "రచ్చ" ఆడియో కార్యక్రమానికి తన బాబాయ్ పవన్ కళ్యాణ్ హాజరుకాకపోవడాన్ని ఓ పత్రిక, ఛానల్ వక్రీకరించి ప్రచారం చేశాయని, తమ కుటుంబంలో ఎలాంటి పొరపొచ్చాలూ లేవని, గతంలో తన నాన్న చిరంజీవిని ఎవరైనా విమర్శిస్తే తన నాన్నకు అండగా బాబాయ్ వుండేవాడని, ఎవరినైనా సరే ముందు తనతో మాట్లాడి వివరణ తీసుకోమని చెప్పేవాడే తప్ప తన అన్నయ్య వరకూ ఎవరినీ వెళ్లనిచ్చేవాడు కాదని, ఆ అన్నకు ఈ తమ్ముడు వున్నట్లే, తన బాబాయ్‌కి తానున్నానని, బాబాయ్ విషయంలో ఏ సమాధానం కావాలన్నా ముందు తనతో మాట్లాడమని ఘాటుగా చెప్పాడు. తాము రాసిందే నిజం, తాము చూపించిందే వాస్తవం అన్నట్లుగా మీడియా ప్రవర్తించడం సరికాదని, ఇకపై మీడియాలో వచ్చే వార్తలు తన వెంట్రుకతో సమానమని చెప్పేశాడు.

ఇదే ఆడియో కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు రాజమౌళి మాట్లాడుతూ "నాయక్" అనే పేరు ఇండస్ట్రీలో రెండు దశాబ్దాలకుపైగా వుంటూ తిరుగులేని నటుడిగా ఎదిగినవాళ్ల సినిమాకి పెట్టాల్సిన పేరని, కేవలం నాలుగు సినిమాల్లో నటించిన రామ్‌చరణ్‌తేజ ఐదవ సినిమాకే ఈ పేరును పెట్టడం దర్శకనిర్మాతల సాహసోపేత నిర్ణయంగా పేర్కొంటూ అదే స్థాయిలో రామ్‌చరణ్‌ను ఈ సినిమాలో వాళ్లు వూహించుకుంటున్నారని చెప్పాడు.

నిజమే, ఇప్పటివరకు నటించింది 4సినిమాలు, వాటిల్లో హిట్టయ్యింది ఒక్క "మగధీర" మాత్రమే, అదికూడా దర్శకుడి ప్రతిభేనన్న విషయం అందరికీ తెలుసు. "ఈగ"ని కూడా హీరోగా పెట్టి సినిమాని హిట్ చేయగల సత్తా రాజమౌళిది. తండ్రి అండనీ, బాబాయ్ కండనీ చూసి 'చరణ్' ఇలా మిడిసి పడడం, ఓవైపు కన్నతల్లిని, మరోవైపు కట్టుకున్న ఆలినీ పెట్టుకుని ఇలా చీప్‌గా ప్రవర్తించడం విడ్డూరంగా వుందని, ముందు తనను తాను రుజువుచేసుకుని ఆ తరువాత ఇతరులని విమర్శిస్తే బాగుంటుందని సినిమాప్రియులు అభిప్రాయపడుతున్నారు.

PDF Compressor Free Version



# నెరసం తెలుగువెలుగు వేడుకలు


సమావేశంలో ప్రసంగిస్తున్న డా॥ సి.శ్రీనివాసరాజు

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16న నెల్లూరు దర్గామిట్టలోని ఐయంఎ హాలులో తెలుగు వెలుగు వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న హృద్రోగనిపుణులు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఆంగ్లభాషను అవసర నిమిత్తం నేర్చుకోవడంలో తప్పులేదని, ఆ సంప్రదాయాన్ని అనుసరించడం మాత్రం ఆత్మవంచనని అన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులకు మాతృభాష గొప్పతనాన్ని తెలిపి వారికి భాషపై అనురక్తి కలిగించాలని తెలిపారు. అవధాని కోట రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచంలో మరే భాషలో లేనన్ని ప్రక్రియలు తెలుగుభాషలో వున్నాయని, పద్యం తెలుగుభాషకే సొంతమని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాటల పోటీల్లో సాయి మిలీనియం స్కూలు విద్యార్థినులు బివికె వాగ్దేవి, వైష్ణవిలు ప్రథమ బహుమతి, కస్తూరిదేవి బాలికల పాఠశాల విద్యార్థిని సౌజన్య ద్వితీయ బహుమతి, సాయి సరస్వతి స్కూలు విద్యార్థిని, ఐవియస్‌యన్ జ్ఞానశ్రీ తృతీయ బహుమతులు పొందారు. కార్యక్రమంలో నెరసం అధ్యక్షులు ఎ.జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, కోశాధికారి మాటేటి రత్నప్రసాద్, సభ్యులు శ్రీనివాసయాదవ్, నాగరాజరావు, కవయిత్రులు ములుగు లక్ష్మి మైథిలి, తన్నీరు శశికళ, కవి పట్టెం వేణుగోపాల్ మొదలగువారు పాల్గొన్నారు.

# మోడరన్ ఐ హాస్పిటల్‌లో 'ఆప్టికాన్ 2012'


శిక్షణా సదస్సును ప్రారంభిస్తున్న డా॥ పి.ఎల్.రావు

నెల్లూరు పొగతోటలోని మాడరన్ ఐ హాస్పిటల్‌లో ఈనెల 16న ఆప్తాల్మిక్ అసిస్టెంట్లకు శిక్షణా సదస్సు ఆప్టికాన్, 2012 జరిగింది. సదస్సులో దక్షిణకోస్తా, రాయలసీమ జిల్లాల నుండి దాదాపు 100మంది ఆప్తాల్మిక్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. చిన్న పిల్లల కంటి వ్యాధులు, కాటరాక్ట్, గ్లకోమా, కార్నియా, రెటీనా వ్యాధులకి సంబంధించిన నూతన పోకడలను గురించి డాక్టర్ పి.ఎల్.రావు మాట్లాడారు. కమ్యూనిటీ ఆప్తమాలజీలో ఆప్తాల్మిక్ అసిస్టెంట్ పాత్ర చాలా ప్రాముఖ్యమైందని, అధునాతన ప్రక్రియలపై అవగాహన కల్పించాలని ఆప్టికన్, 2012ని నిర్వహించామన్నారు. సదస్సులో డాక్టర్లు బి.కృష్ణమూర్తి, రాజశేఖర్, జ్యోతి మొదలగువారు పాల్గొన్నారు.

# కల్యాణ వైభవం!


తిరుమలతిరుపతి దేవస్థానం రిటైర్డ్ సూపరింటెండెంట్ విడిగంటి మల్లికార్జునరావు - కనకదుర్గల కుమారుడు **హరికిషోర్ - ప్రీతి** ల వివాహం ఈ నెల 7వ తేదీ వైయస్సార్‌కడపజిల్లా ప్రొద్దుటూరులో వైభవంగా జరిగింది. నూతనదంపతులకు'లాయర్' శుభాకాంక్షలు.


ఆర్టిస్టు రాజీగా నెల్లూరీయులకు సుపరిచితులైన రాజేంద్ర గురిజాల-శ్రీమతి సుధీరల కుమారుడు **విజిత్ - లక్ష్మీ ప్రశాంతి** ల కల్యాణం ఈ నెల 16వ తేదీ కావలిలోని ది హ్యాండ్లూమ్ క్లాత్ మర్చెంట్స్ కల్యాణ మండపం నందు ఘనంగా జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభాభినందనలు.



# బాబోయ్ పాములు

అమ్మో! పాములు, తేళ్ళు! రాత్రయితే చాలు ఇళ్ళలోంచి బయటకు రాకూడదు. ఆ ప్రదేశంలో తిరగకూడదు. అంతా చీకటిమయం, భయంకరమైన విషనాగులు, జెర్రిపోతుల బారినపడతాం. వీధిలైట్లు లేవు. సక్రమమైన రోడ్లులేవు. అంతా గుంటలుమిట్టలు. పగలే ఆ దారిన నడవలేం ఇక రాత్రయితే భయం, భయం. దారిన నడుస్తుంటే ఏ పామొచ్చి కాటేస్తుందో ఏమోనని వణికిపోతుంటాం. ఇదెక్కడో ఏ మారుమూల పల్లెలోనో, కుగ్రామంలోనో అనుకునేరు సుమా! అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్లే. ఈ పరిస్థితి వున్నది మన నాజూకైన నెల్లూరు నగరంలోనే. అందులో మిలమిల మెరిసే తారకలవంటి అపార్ట్‌మెంట్లకు ఆలవాలమవుతున్న మాగుంటలే-అవుట్‌కు తూర్పున వున్న గోమతినగర్‌లోనే. నగరంలో అభివృద్ధి జాడలు అంతటా అంతో ఇంతో కనిపిస్తున్న ఈ సమయంలో ఇక్కడ మాత్రం రోడ్ల గురించి కాని, మంచినీళ్ళ గురించి కాని, వీధిలైట్ల గురించి కాని పట్టించుకున్న నాథుడే కనిపించడంలేదు. రాత్రయితే గోమతి స్కూలు వైపువెళ్ళే సిమెంటు రోడ్డులో వీధిలైట్లు లేకపోవడంతో నడిచి వెళ్ళే పరిస్థితి కనిపించడంలేదు. విష పాములు తిరుగుతుండడంతో బాటసారులు వణికిపోతున్నారు. తప్పనిస్థితిలో టార్చిలైటు వెలుగులో భయంభయంగా నడిచిపోతున్నారు. ఇక అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న వారికి స్నానం చేయాలంటే భయం ఎందుకంటే అక్కడున్న ఉప్పునీళ్ళతో స్నానం చేసినా ఒకటే, చెయ్యకపోయినా ఒకటే వంటి మీద మురికి వదిలితే కదా! ఒక విధంగా ఇక్కడ నివాసితులు ఈ సమస్యలతో నరకయాతన అనుభవిస్తున్నారు. నగర కమీషనర్ ఓ మారు వీరి సమస్యలపై దృష్టిపెట్టి తగు చర్యలు చేపట్టి పరిష్కరిస్తే బాగుంటుంది.


# యోగాతో ఆరోగ్య యోగం



యోగాతో ఆరోగ్యమే కాక మనిషిలో చురుకుదనం కూడా పెరుగుతుందని యోగా గురువు యం.సనత్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీన నెల్లూరు మూలాపేటలోని ఏనుగు సుందరరామిరెడ్డి నగర పాలక ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు ఆయన యోగా మరియు జ్ఞాపకశక్తిని పెంపొందించుకునే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు యోగా పద్ధతులను తెలియజేయడమే కాకుండా విరామ సమయంలో ఆయిల్‌తో చేసిన ఆహారపదార్థాలు తినకుండా ప్రకృతి సిద్ధంగా వచ్చిన పండ్లను తినాలని సూచించారు. ప్రతి విద్యార్థి కూడా రోజూ 20నిముషాల పాటన్నా యోగా చేయాలన్నారు.

రోటరీక్లబ్ వారు ఈ కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు కొట్టే మధుసూదన్‌రావు, కార్యదర్శి కె.వి. సుబ్రహ్మణ్యం, స్కూల్ ప్రధానోపాధ్యాయులు శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయివనంలా మారుతున్న జిల్లా



నెల్లూరుజిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకాలు భారీగానే జరుగుతున్నాయి. సుదూర ప్రాంతాల నుండి గంజాయి, హెరాయిన్, మత్తుద్రావకాలు నెల్లూరుజిల్లాకు తరలించుకొని వచ్చేందుకు అనేక మార్గాలను సుగమం చేసుకొనివున్నారు. ఈ అక్రమార్కులు పెద్దస్థాయిలో సరుకు నిల్వలను నగరంలో వుంచకుండా సముద్రతీర ప్రాంత గ్రామాలు, నగరానికి సమీపగ్రామాలను ఎంచుకుంటున్నారు. ఇది కేవలం అధికారులను ప్రక్కమార్గానికి మళ్ళించేందుకేననేది స్పష్టం. అయితే అక్కడక్కడా పొరపాటుగా మాదకద్రవ్యాలు దొరకటం విశేషం. అలాంటి సంఘటన అల్లూరు పట్టణంలో 15వతేదీ జరిగింది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న అల్లూరు పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, సిబ్బంది ఒక టాటామ్యాజిక్ వాహనంలో అనుమానాస్పదంగా వున్న బస్తాను మూతవిప్పారు. ఇంకేముంది ఆరు కిలోల గంజాయి అందులో దొరికింది. పోలీసువిచారణలో తేలిందేమిటంటే ఇస్కపల్లి గ్రామానికి చెందిన కొండూరు సిద్ధమ్మ రాజమండ్రి నుండి రైలులో గంజాయి తరలించుకొనివచ్చింది. తన గ్రామానికి దాన్ని తీసుకొనివెళ్లేందుకు సమీపగ్రామమైన శంభునివారిపాళెంకు చెందిన టాటా మేజిక్ డ్రైవర్ పురిణి శ్రీనివాసులుతో మాట్లాడుకొని బాడుగ ఖరారు చేసుకొంది. ఇద్దరూకలసి ఈ బస్తాతో పాటు మరేవో కొన్ని బస్తాలు వేసుకొని ఇస్కపల్లివైపు వెళుతుండగా పెట్రోలింగ్ పోలీసులు వారి విధిలో భాగంగా ఆపి పరిశీలించారు. గంజాయి దొరికింది. వారిపై కేసు నమోదు చేసారు. ఇతర జిల్లాల, రాష్ట్రాల నుండి కూడా మాదకద్రవ్యాలు నెల్లూరు జిల్లాకు భారీగానే తరలివస్తున్నట్లు సమాచారం. ఎవరి చేతుల్లో డబ్బు కొట్టున్నారోకానీ వ్యాపారం సాగిపోతుంది. వాస్తవం ఏమిటంటే గంజాయి తాగాలనుకొనేవాడికి అది ఎక్కడ దొరుకుతుందో గన్‌షాట్‌గా తెలుసు. బహిరంగ ప్రదేశాలలో కూర్చుని దమ్ము లాగించేస్తుంటారు. అటువంటిది పోలీసులకెందుకు తెలియదు చెప్మా అనేది సామాన్యుడి అనుమానం..!

## కాలధర్మం

# అల్లీపురం బాలయ్య



నెల్లూరు జిల్లా కసుమూరు ప్రాంతంలోని చవటపాళెం గ్రామవాస్తవ్యుడు గొరినేని బాలకృష్ణయ్య తన 75వ యేట డిసెంబర్ 16న మరణించారు. 1975-80ప్రాంతంలో నెల్లూరు వేదాయపాళెం వద్ద పౌల్ట్రీ వ్యాపారాన్ని ప్రారంభించి అనతికాలంలోనే మంచి ఫలితాలను సాధించి అనంతరం తన వ్యాపారాన్ని అల్లీపురానికి మార్చి అక్కడే స్థిరపడి పోవడంతో అల్లీపురం బాలయ్యగా ఈయన ప్రసిద్ధి చెందారు. బాలకృష్ణయ్య ఏకైక కుమారుడు జి.శ్రీనివాసుల నాయుడు, జి.యస్.నాయుడిగా అల్లీపురం శీనయ్యగా అందరికి సుపరిచితుడే. గత నాలుగేళ్ళుగా హైదరాబాదులో తన కుమారుడి వద్ద వృద్ధాప్య జీవితాన్ని సాగిస్తున్న బాలయ్య ఆకస్మిక అనారోగ్యంతో డిసెంబర్ 16న పరమపదించారు. శ్రీ... కు వారి కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలుపుతోంది "లాయర్".

# “ఐనాక్స్”గా అవతరించిన సుబ్బరామిరెడ్డి మహేశ్వరి - పరమేశ్వరి





జ్యోతిప్రజ్వలను చేసి మహేశ్వరి-పరమేశ్వరి ఐనాక్స్‌ను ప్రారంభిస్తున్న అతిథులు, అతిరథులు

మహేశ్వరి, పరమేశ్వరి... హైదరాబాద్ కాచీగూడ చౌరస్తాలో ఈ రెండు సినిమాహాళ్లు ఒకప్పుడు యాత్రాప్రదేశంలాంటిది. ఆంధ్రప్రదేశ్‌లోనేకాదు బహుశా భారతదేశంలోనే “ఎస్కలేటర్” (కదిలేమెట్లు) వున్న మొట్టమొదటి సినిమాహాళ్లు ఇవే అని అప్పట్లో ప్రసిద్ధి. హైదరాబాద్‌లో ప్రసిద్ధ ప్రదేశాలను యాత్రికులకు చూపించే టూరిస్ట్ సంస్థలు ఈ హాళ్లను కూడా అప్పట్లో ప్రత్యేకంగా సందర్శకులకు చూపించేవాళ్లు. తాను చేసే ప్రతి పనిలోనూ వైవిధ్యంతో పాటు సంచలనానికి ప్రాధాన్యత ఇచ్చే టిక్కవరపు సుబ్బరామిరెడ్డి 1981 ప్రాంతంలోనే అంటే దాదాపు 32 సంవత్సరాలక్రితమే అత్యాధునిక వసతులు కలిగిన రెండు సినిమాహాళ్ళను మహేశ్వరి, పరమేశ్వరి పేర్లతో హైదరాబాదులో నిర్మించారు. అమితాబచ్చన్, రేఖ, జయబాధురి నటించిన సంచలనాత్మక హిందీ చిత్రం “సిల్‌సిలా”తో పాటు, ప్రపంచవ్యాప్తంగా చరిత్ర సృష్టించిన ఆంగ్ల చిత్రం “జాస్” సినిమా అప్పుడు ఈ రెండు హాళ్లలో తొలి చిత్రాలుగా ప్రదర్శింపబడ్డాయి. అయితే కాలంతో పాటు వసతులూ మారాయి. టెక్నాలజీ పెరిగిపోయింది ఇప్పుడంతా మల్టీప్లెక్స్‌ల యుగం వచ్చేసింది. తనదైన స్టైల్‌లో ఇప్పుడు మహేశ్వరి, పరమేశ్వరీలకు కొత్తరూపం కల్పించారు టి.యస్.ఆర్. రెండు సినిమాహాళ్ల స్థలంలో సెంట్రల్ మాల్‌ను నిర్మించి ఇక్కడ మహేశ్వరి, పరమేశ్వరీల పేరుతో ఒక ఐనాక్స్ థియేటర్‌తో పాటు మరో నాలుగు సినిమాలయాలను స్క్రీన్1 నుండి స్క్రీన్5 వరకూ నిర్మించారు. ముంబై వంటి మహానగరాలలో వున్న అధునాతన సౌకర్యాలను ఈ సినిమాహాలు ప్రాంగణంలో అమర్చారు. సుబ్బరామిరెడ్డి అంటే వేరే చెప్పాలా... గులాంనబీ ఆజాద్‌తో పాటు ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, కేంద్రమంత్రి మెగాస్టార్ చిరంజీవి, ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డుగ్రహీత, నటసామ్రాట్, పద్మవిభూషణ్ డా॥ అక్కినేని నాగేశ్వరరావు, ఆనం రామనారాయణరెడ్డి, బొత్సా సత్యనారాయణ, బోనీకపూర్, జయప్రద, శ్రీదేవి వంటి దిగ్గజాలను తీసుకొచ్చి డిసెంబర్ 15, 2012న ఈ సినిమాహాళ్లను ప్రారంభింపజేశాడు.

1981లో సుబ్బరామిరెడ్డి నిర్మించిన నాటి మహేశ్వరి, పరమేశ్వరికీ నేటి ఈ “ఐనాక్స్” ప్రాంగణానికి అసలు పోలికేలేదు. ఔరా! అనే స్థాయిలో నేటి అవసరాలకు అణుగుణంగా ఈ ప్రాంగణాన్ని రూపుదిద్దారు. సుబ్బరామిరెడ్డికి మరోసారి అభినందనలు.

# తెలుగును వెలిగిద్దాం



తెలుగు మహాసభలను ప్రారంభిస్తున్న జిల్లాకలెక్టర్ బి.శ్రీధర్, పక్కన ఇతర ముఖ్యఅతిథులు

ఈ నెల 27, 28, 29తేదీలలో తిరుపతి వేదికగా జరగనున్న 4వ ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతం చేయాలనే స్ఫూర్తితో 20, 21వ తేదీలలో నెల్లూరులోని వి.ఆర్.హైస్కూల్ మైదానంలో శ్రీ మహాకవి తిక్కన ప్రాంగణంలో స్థానికంగా తెలుగుమహాసభలను నిర్వహించారు. తెలుగు భాషా విశిష్టతను తెలియజేయాలని ఏర్పాటు చేసిన ఈ మహాసభలకు ఎక్కువసంఖ్యలో ప్రజాప్రతినిధులే గైర్హాజరయ్యారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి 20వ తేదీ ఈ మహాసభలను ప్రారంభించాల్సి వున్నప్పటికి ఆయన హఠాత్తుగా హైద్రాబాద్ వెళ్లిపోయారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఆరోగ్య కారణాల దృష్ట్యా హైద్రాబాద్‌లోనే వుంటున్నారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, విఠపు బాలసుబ్రహ్మణ్యంలు హాజరయ్యారు. నెల్లూరు ఎంపీగాని, తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గాని ఈ ప్రాంగణం ముఖమే చూడలేదు. జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్, జాయింట్‌కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, అదనపు జాయింట్‌కలెక్టర్ బి.రామిరెడ్డి, డీసీసీ ఇన్‌ఛార్జ్ అధ్యక్షులు చాట్ల నరసింహారావు, నగరపాలక సంస్థ కమీషనర్ టీఎస్‌ఆర్ ఆంజనేయులు తదితరులు ప్రారంభోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. వక్తలు తమ ప్రసంగాలలో తెలుగుభాషను, తెలుగు సంస్కృతిని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. ఈ మహాసభలలో ఆయా పాఠశాలల విద్యార్థులే ప్రధాన ఆకర్షణ అయ్యారు. తెలుగు మహాసభలను పురస్కరించుకుని నెల్లూరులోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థలలో కూడా విద్యార్థులను సంప్రదాయ దుస్తుల్లో రావాలని చెప్పివున్నారు. అచ్చతెలుగు వస్త్రధారణతో వచ్చిన విద్యార్థులు, విద్యార్థినులతో సభాప్రాంగణం కళకళలాడింది. సభకు ముందు నగరంలోని పలు ప్రాంతాల నుండి విద్యార్థులు ప్రదర్శనగా బయలుదేరి వి.ఆర్.హైస్కూల్ మైదానానికి చేరుకున్నారు. అచ్చతెలుగు పంచెకట్టుతో వచ్చిన కలెక్టర్ శ్రీధర్ సభకు ప్రత్యేకఆకర్షణగా నిలిచారు.

# “షర్మిల” పాదయాత్రకు 6వారాల విరామం

## కాలుకు గాయమే కారణం



తండ్రి ఆశయాలనీ, అన్న ఆకాంక్షని నెరవేర్చడమే ధ్యేయంగా, 3000కిలోమీటర్ల పాదయాత్ర లక్ష్యంగా చేసుకుని తన నడకను సాగిస్తుండిన వై.యస్. కుమార్తె శ్రీమతి షర్మిల పాదయాత్రకు బ్రేక్‌పడింది. తెలంగాణలో సైతం వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీకి వున్న జనాదరణ ఏపాటిదో ప్రతిపక్ష పార్టీలకు తెలియజేస్తూ ముందుకు సాగుతుండిన షర్మిల కాలికి గాయం కావడం, ఆ గాయం ముదిరి శస్త్రచికిత్స దాకా వెళ్లడంతో మంగళవారం (18వతేది) హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో ఆమెకు ఆపరేషన్ చేశారు. కనీసం ఆరు వారాల పాటు విశ్రాంతి అవసరమని డాక్టర్లు సూచించడంతో ఆమె తన యాత్రకు కామాపెట్టారు. శస్త్రచికిత్సకు ఒకరోజు ముందు ఆమె చంచల్‌గూడ జైలుకు వెళ్ళి తన అన్న వై.యస్.జగన్‌ను పలకరించి వచ్చారు. షర్మిల త్వరలోనే కోలుకుని తన పాదయాత్ర కొనసాగించాలని ఆకాంక్షిద్దాం.

# వివేకాకు పరామర్శల వెల్లువ



ఆనం వివేకానందరెడ్డి లేకుంటే నెల్లూరు నగరమే నిశ్శబ్దంగా తయారయ్యింది. ఎటువంటి రాజకీయ సందడి లేకుండాపోయింది. ఆయన్ను చూసి చాలారోజులయ్యే సరికి నెల్లూరునుండి జనం హైదరాబాద్‌కు వెళుతున్నారు. అనారోగ్యంతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వివేకాను ఇటీవల కేంద్రమంత్రి మెగాస్టార్ చిరంజీవితో పాటు రాజకీయ ప్రముఖులు, నెల్లూరునుండి పెద్దసంఖ్యలో వెళ్లిన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. సందర్శకుల తాకిడి ఎక్కువ కావడంతో వివేకాని మంగళవారం మళ్లీ స్టార్ ఆసుపత్రికి తరలించారు.





బ్రాండెడ్ జీన్స్ ₹ ~~799/-~~ 399/-
బ్రాండెడ్ షర్ట్స్ ₹ ~~799/-~~ 399/-
క్యాజువల్ షర్ట్స్ ₹ ~~499/-~~ 249/-

జెంట్స్ బ్రాండెడ్ రెడీమేడ్స్‌పై 20% నుంచి 50%

చుడీదార్స్, డ్రస్‌మెటీరియల్, వెస్ట్రన్‌వర్ చిల్డ్రన్ రెడీమేడ్స్‌పై 20% నుంచి 50%

ఎంబోజ్ పట్టుచీర ₹~~3286/-~~ 1399/-

మల్టీ కలర్ స్టోన్ పట్టుచీర ₹~~2986/-~~ 1150/-

చెట్టునాడు ప్రింటుశారీ ₹950/- 1+1

బెనారస్ 1/2 & 1/2 ఫ్యాన్సీ శారీ ₹896/- 1+1

లెనిన్, రేమాండ్స్, రేడ్ & టేలర్, సూటింగ్స్, షర్టింగ్స్, బెడ్‌షీట్స్, దివాన్‌సెట్స్ పై 50% వరకు తగ్గింపు

CMR SHOPPING MALL NELLORE
CMR సెంటర్, G.T. రోడ్ నెల్లూరు, ఫోన్: 2330666

చందన బ్రదర్స్ లేడీస్ & జంట్స్ క్లాత్ షోరూమ్ ట్రంక్ రోడ్ నెల్లూరు
ఫోన్: 2323420


Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003 Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.